అరుణాచలవాసా!



వంగర నాగ దుర్గా శరచ్చంద్ర



కం. శ్రుతి స్మృతి పురాణముల పరి
ణతులై, అద్వైత చేతనా క్రాంతిగ ష
ణ్మతముల స్థాపన జేసిన,
యతి వర్యులు శంకరుని అంజలిమోడ్తున్!

అరుణాచలవాసా!

(అరుణాచలేశునికి శత కందముల "భారద్వాజుని' విందు')

రచయిత

వంగర నాగ దుర్గా శరచ్చంద్రు

అరుణాచలవాసా!

రచన : **వంగర నాగ దుర్గా శరచ్చంద్ర**

ప్రథమ ముద్రణ: అక్టోబర్, 2025

ప్రతులు : 500

వెల: రూ. 75/-

ప్రతులకు:
వంగర ఓంకారేశ్వర వర ప్రసాదు
డోర్ నెం. 26-40-13/సి, నిర్మల కాన్వెంట్ దగ్గర,
4వ లైను, ఏ.టి. అగ్రహారం, గుంటూరు - 522 004
ఆంధ్రప్రదేశ్
సెల్ : 74164 26242, 98498 06080

ISBN No. : 978-93-344-2429-4

ముద్రణ :
సాయిలిఖిత ప్రింటర్స్
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004
ఫోన్ : 72070 45979

స్వకీయము

శివాయ గురవే నమః

సదాశివ సమారంభాం శంకరాచార్యమధ్యమాం ।
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ॥

శృతి స్మృతి పురాణానామాలయం కరుణాలయం ।
నమామి భగవత్పాద శంకరం లోకశంకరం ॥

"ఆంధ్రత్వం ఆంధ్ర భాషాచ అభ్యంతర దేశ స్వజన్మ భూః ।
తత్రాపి యజుషీ శాఖా న అల్పస్య తపః ఫలమ్ ॥"

(ఆంధ్రునిగా, ఆంధ్రభాష మాతృభాషగా జన్మించడం మహా పుణ్యము; అందులోను యజుర్వేద శాఖలో జన్మించడం అంతకు మించిన అదృష్టము.) అని అప్పయ్య దీక్షితుల వారు ఆంధ్ర భాష యొక్క ప్రాముఖ్యతని కీర్తించారు. అటువంటి ఆంధ్రదేశంలో పుట్టి, తెలుగు భాష మాతృభాషగా ఉండటం నా అదృష్టంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. శివ గాథలను, ముఖ్యముగా అరవై ముగ్గురు భక్త నాయనారుల దివ్యచరితములు పారాయణ చేయునప్పుడు వారి భక్త్యావేశములో అణువంతయయినను నాకు కలగాలని తపన వుండేది. వారి అసమానమైన భక్తి చరితము చిన్ననాటి నుండి కథల రూపములో వినుటచే నాలోపలి శివభక్తియనే జ్యోతికి నిరంతరాజ్యమైనది.

పాంచభౌతికమైన శరీరము పంచముఖుని సేవకే అని నమ్మికగల కుటుంబ వాతావరణమున పంచాక్షరి జపము మా నిత్య కృత్యమయ్యె. పురాణేతిహాస సాహిత్య గ్రంథాలే మా వంశపారంపర్య మూలధనము. మా తాతగారు బ్రహ్మశ్రీ వంగర కాశీవిశ్వేశ్వర వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు, శివతత్త్వాన్ని, అద్వైత సిద్ధాంతాన్ని తెలుగులో అందంగా సంకలనం చేసిన "శ్రీ అద్వైత శాంకరి" శతకకర్త. బాల్యంలో ఆయన రచన వల్ల నాకు కవిత్వం మీద మక్కువ పుట్టింది. వారి ప్రేరణ ఈ శతకంలోని కొన్ని పద్యాల్లో స్వతంత్రంగా ప్రతిఫలించింది. అలాగే మా తండ్రిగారు బ్రహ్మశ్రీ వంగర ఓంకారేశ్వర వరప్రసాదు గారు, శంకర భగవత్పాదుల జీవితాన్ని పద్యరూపంలో ఆవిష్కరించిన "శంకరప్రభ" అనే లఘుకావ్య రచయిత. మా మేనత్త గారు శ్రీ వంగర సుజాత గారు సంస్కృతాంధ్ర భాషా ప్రవీణ పట్టభద్రురాలు. వీరందరి మధ్యన పెరిగిన వాతవరణమో, మరి ఏ ప్రేరణ వల్లనో, ఒక దివ్య స్ఫురణ

కలిగి ఆ అరుణాచలేశ్వరుని పై శతకము వ్రాయ సంకల్పము కలిగినది. భాషా వ్యాకరణాలలో ప్రౌడిని కాకుండినను, "సంకల్పితం కార్యం న హి విఫలతాం గచ్ఛతి" అనే సత్యాన్ని నమ్ముతూ, సంకల్పము జేయించిన వాడే దానిని నెరవేర్చునని అని "అరుణాచలవాసా!" అని మకుటముతో శతకము వ్రాయుట జరిగినది.

"యత్కించిత్ కవితా రసేన సహితం శంభోస్తవే దీయతే ।
తత్ సర్వం తవ పాదపద్మయుగళే సమర్పితం తత్క్షణాత్ ॥"

(శివునిపై కవితా భావంతో వ్రాయబడిన చిన్న వాక్యమైనను అది తక్షణమే ఆయన పాదపద్మాలకు సమర్పించబడుతుంది.)

పంచభూత క్షేత్రములలో ఒకటియైన అరుణాచలము అగ్నికి ప్రతీకగా నిలుస్తుంది. సంబంధ నాయనారు, తిరునావుక్కరసర్ (అప్పర్) నాయనారు, మాణిక్యవాచకర్ నాయనారు, మహాకవి అరుణగిరినాథర్, రమణ మహర్షుల వంటి వారెందరో తరించి ముక్తి పొందిన క్షేత్రమది.

అరుణాచలమనే స్ఫురణ రాగా బాల్యము నుండి వినెడు భగవాన్ రమణుల "అక్షరమణమాల" జ్ఞప్తికి వచ్చినది. మహా విరాగియైన రమణులు తమని తాము ప్రేయసిగ, అరుణాచలేశ్వరుని సఖునిగ భావన జేసి "అక్షరమణమాలై" అని వ్రాసారు. ద్రావిడ భాషలో "మణమ్" అనగా వివాహం, "మాలై" అనగా మాల. "మణమాల" అనగ కళ్యాణమాల. "అక్షరమణమాల" రమణులచే అరుణాచలేశ్వరునికి అలంకరించబడిన అక్షరాల దండ. అది జీవాత్మకి పరమాత్మకి గల బంధానికి చిహ్నం. ద్వైతముతో మొదలై అద్వైతములో ముగిసే భావనా గీతం. సాధారణ ప్రజలకు అరుణాచలమనేది ఒక కొండ మాత్రమే. కానీ అది రమణులకు మాత్రము ఘనాకారము దాల్చిన పరశివ కరుణా రూపము. వారికి అరుణాచలేశునికీ అబేధం లేని అద్భుత అద్వైత స్థితి రమణులు పొందిరి.

అటువంటి భావనా శైలిని, ఆ "అక్షరమణమాల"ని ప్రేరణ పొంది, రమణుల మీద ఆరాధ్య భావముతో "అరుణాచలవాసా!" అని శతకము వ్రాసితిని. ఇది అనువాదం కాదు, అనుకరణ కాదు. కానీ ఆధ్యాత్మిక ప్రేరణ మాత్రమే. వారి వైరాగ్య స్థితిని చేరుట ఎవ్వరికి సాధ్యము?

ఎల్లరుకూ చేరువయ్యే ప్రయత్నమున మృదులమైన తెలుగు పదాలను ఉపయోగించుచు, అందుకనుగుణంగా "కందము"ను ఛందస్సుగా యెంచుకుంటిని. మా తాతగారు వారి శతకములోని ఒకచోట "పట్టినపట్టు వీడనిక..గట్టిగ నిన్నె

కొల్చెదను..” అని ఎన్ని అవంతరాలు వచ్చినా నిన్నే కొలుస్తాను శాంకరీ అని చెప్పారు. వారి ఉపాసనా దేవతపై వారికి యున్న నమ్మిక అది. నేను ఆ అరుణాచలేశునిపై అటువంటి నమ్మికతో మొదలు పెట్టిన శతకము ఇది. మద్యలో కొన్ని మార్లు వ్యాకరణపరమైన దోషాలు, భాషా సంబంధ దోషాలు వచ్చి శతక రచన నెమ్మదికాగా, ఆ శంకరుడే మా గురువు గారు ‘పద్యశంకరుని’గా వచ్చి సరియైన మార్గములో నడిపించి నా చేత ఈ శతకమును విజయవంతముగా పూర్తి చేయించిరి.

ఈ ప్రయత్నంలో మొదటగా మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పాటుగా శ్రీమతి పర్వతనేని శ్రీసత్యగారు, బ్రహ్మశ్రీ కొల్లారపు ప్రకాశ రావు శర్మ గారు, సాహిత్య పరంగా, ఛందస్సు పరంగా సూచనలిచ్చి బలమైన మార్గదర్శకత్వం వహించారు. వారి సహకారంతోనే ఈ శతకరూపం సుసంపూర్ణమైంది. వీరందరికీ సర్వదా కృతజ్ఞుడను.

ప్రేరణ ఇచ్చినవాడు, వ్రాయించుకున్నవాడు అరుణాచలవాసుడు. సూచనలు ఇచ్చిన వారు మేనత్త మరియు తండ్రి. నా భాషకు, ఛందస్సు, అలంకారములను తీర్చిదిద్దిన వారు గురుదేవులు. చివరుకు పరికించగ నేను కేవలం నిమిత్త మాత్రుడనే సత్యము బోధ గరిపిన ఆ శివునకు సదా దాసుడను.

“న చాహం న త్వమేవాసి, నాహం నైవ చ యే జగత్ ।
త్వమేవ కేవలం శంభో, విశ్వమేదం విచిత్రితమ్ ॥”

శ్రీ అపితకుచాంబిక సమేత అరుణాచలేశ్వరుని పాదపద్మములకు ప్రణతులిడుచు, “ఈశ్వరార్పణమిదం” అనే అంకితభావముతో ఈ శతకము మీ ముందుంచుతున్నాను.

ఇట్లు

వంగర నాగ దుర్గా శరచ్చంద్ర

శతకకర్త

శ్రీ విశ్వావసు నామ సంవత్సర
ఆశ్వీయుజ శుద్ధ పూర్ణిమ
ది. 06-10-2025

'పద్య శిక్షణా ద్రోణు'నకు నమస్సుమాంజలి

"స్వదేశే పూజ్యతే రాజా, విద్యావంతః విదేశికే ।
విద్యా పరమం ధనం ప్రోక్తం, విద్యా భూషణముత్తమం ॥"



(తన దేశంలో రాజు గౌరవించబడతాడు; కానీ విద్యావంతుడు ఎక్కడైనా గౌరవించబడతాడు. విద్యయే ఉత్తమ సంపద, విద్యయే శ్రేష్ఠమైన అలంకారం.)

తెలుగు పద్యసాహిత్యం పట్ల చిన్ననాటినుంచి మక్కువ ఉన్నా, తగిన వాతావరణం ఉన్నా కూడా, "కవిత్వం జన్మస్థమైనా, సజీవమవ్వుటకు సమయముండాలి" అనే ఆర్యోక్తి ప్రకారం, సాహిత్య పాఠకుడిగా మాత్రమే మిగిలాను. రచనకు సాహసించేందుకు సమయానుకూలత ఇప్పుడు కలిగింది.

ఒక రోజు యాదృచ్ఛికంగా బ్రహ్మశ్రీ కొల్లారపు ప్రకాశ రావు శర్మ గారి రచన 'పద్యరచనామృత బోధిని' నా దృష్టికి వచ్చింది. తొలి పాఠము చదవగానే గురు, లఘువుల గుర్తించుట కరతలామలకమైన భావన కలిగింది. వెంటనే ఛందస్సు శాస్త్రాభ్యాసంపై పూర్తి ఆసక్తి కలిగింది. అప్పటిదాకా వృథా చేసిన సమయంపై చింతతో, వెంటనే వారిని సంప్రదించాను. ఆ సమయంలోనే నాకు ఒక గొప్ప సత్యం గుర్తొచ్చింది:

"దుర్లభం త్రయమేవైతత్ దేవానుగ్రహహేతుకం ।
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః ॥"

(ఈ లోకంలో మానవ జన్మ, మోక్షలాలస, మహానుభావుల సన్నిధానం – ఇవి దైవ అనుగ్రహం వల్ల మాత్రమే లభిస్తాయి.)

ఆ దైవానుగ్రహంగా నాకు శ్రీ శర్మగారు గురువుగా లభించడం నా అదృష్టము.

"విద్వత్త్వం దక్షతా శీలం సంక్రాంతిరనుశీలినం ।
శిక్షకస్య గుణాః సప్త సచేతస్త్వం ప్రసన్నతా ॥"

(విద్వత్తు, దక్షత, మంచితనం, శిక్షణ నైపుణ్యం, స్వాధ్యాయం, అప్రమత్తత, ప్రసన్నత – ఇవే గురువుకు గల గుణాలు.)

ఈ గుణాలన్నింటినీ నింపుకొన్న వ్యక్తి శ్రీ శర్మగారు. పది వారాల్లోనే పది రకాల పద్యాలు ఛందోబద్ధముగా రచించడం నాకు సాధ్యమవుతుందని కలలో కూడా అనుకోలేదు. కానీ ఆ అసాధ్యాన్ని సాధ్యం చేసిన శిక్షణా దురంధరుడు గురువుగారే.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోస్త్వకర్మణి ॥"

అన్న గీతాచార్యుని బోధను పాటిస్తూ,"తప్పులు చేయుట సహజము, వ్రాయండి, తప్పుల్ని నేను సరి చేస్తాను" అంటూ నూతన విద్యార్థుల్లో ఆత్మన్యూనత తొలగించి ప్రోత్సహించారాయన. పుస్తకాలు శాస్త్రజ్ఞానం ఇస్తాయి, కానీ కళకు ప్రాణం పోసేది గురువే. శర్మగారి సహవాసం, ఛందస్సు పాఠాలు నాకు కవిత్వముపై మరింత ఆసక్తిని, అనురక్తిని ఇచ్చాయి.

"శా. అంతా 'మంథని దేవి' యిచ్చనుచు యే హంకారముల్జూపక
న్నంతఃకోణములో, మనోరథములో, ఆంధ్రత్వమాకాంక్షియై,
అంతర్జాలములోన పద్యకుసుమాలందిచ్చు యాచార్యులౌ,
అంతఃప్రజ్ఞులు 'శర్మ'గారు ఘనులై, ఆరాధ్యులై నిల్చెనే!"

పద్యరచనలో భగీరథ ప్రయత్నము చేస్తున్నవారికి జ్ఞాన గంగను ప్రసాదించేవారు ఆయన అని శర్మగారి బిరుదుల్లో 'పద్య శంకర' అనే మాట విన్నప్పుడు అర్థమవుతుంది. ఇది అంతా వారి ఇష్టదేవత 'మంథని అమ్మవారి' కృపయనుట, వారి నిరహంకార, నిర్మల హృదయమునకు నిదర్శనము. ఒక పద్యము వ్రాసినవారికి కలిగే గర్వములో ఒక్క శాతములో ఒక్కశాతము కూడా ఆయనలో కనిపించదు – అదే వారి అసలైన గొప్పతనము.

"వాక్యేషు ధాతుః ప్రయోగో యథాస్థానం ప్రయుక్తయః ।
వ్యాకరణబలం తేభ్యో నిత్యం కవిత్వే పరిగణ్యతే ॥"

(పదబంధంలో ధాతువులను స్థానానుసారం వాడటం, వ్యాకరణబలం, ఇవి కవిత్వానికి ఎంతో అవసరం.)


దీనిని శర్మగారు విద్యార్థులకు తేలికైన పదములతో, అనేక ఉదాహరణలతో తెలియజేసారు. శిక్షణా తరగతులు పూర్తయ్యే సమయానికి విద్యార్థికి పది రకాల పద్యరీతులు మాత్రమే కాకుండా, అనేక వ్యాకరణ పరమైన మెలకువలు కుడా తెలిసేవి. అది వారి శిక్షణా నైపుణ్యతకి నిదర్శనము.

నేను 'అరుణాచలవాసా!' అనే శతకాన్ని పూర్తి చేయుటకు ప్రేరణదాత శర్మగారే. వారి అనేక శిష్యులు ఇప్పటికే బహు శతకకర్తలుగా, అవధానులుగా నిలిచారన్నది యెల్లరుకు విదితమే. ఈ సందర్భంగా నా మనసులో కలిగిన మరో చిన్న పద్యాన్ని వారికి అంకితంగా సమర్పిస్తున్నాను:

"కం. గురువిది, లఘువిదని యెఱుక
పరచి ముదమునన్ కవిత్వపాటవమును యె
ల్లరుకు నొసగు గురువగు కొ
ల్లరపు ప్రకాశ కవివర్య! రహిగాంచుమిలన్!"

భవదీయుడు,
వంగర నాగ దుర్గా శరచ్చంద్ర

భక్తిభావమంజూష



వర్ధమానకవి చి. శరచ్చంద్ర రచించిన "అరుణాచలవాసా" శతకాన్ని పూర్తిగా చదివాను. ప్రతిపద్యంలో భక్తిభావం స్పష్టంగా గోచరిస్తుంది. ఇందు కవి భగవంతునికి తన లోపాలను తెలుపుతూ, ఆయనను శరణువేడి వానిని అధిగమించే మార్గాలను చూపుమని ప్రార్థిస్తాడు. 7వ పద్యంలో భవభంధాలను వీడకుంటిని, జపతపాలను చేయిలేను. నేను నీ దరికి చేర్చే మార్గాన్ని చూపుమని ప్రార్థిస్తాడు. 12వ పద్యంలో ఏకాగ్రతతతో నిన్ను కొలిచేవారికి, స్మరించేవారికి నాకంతో ఏమి పని అంటాడు. 14వ పద్యంలో నయనారులను తండ్రివలె ప్రేమతో బ్రోచినట్లు తనను కూడా ప్రేమతో బ్రోవుమని ప్రార్థిస్తాడు. 32వ పద్యంలో మాయాపూరిత జగంలో నివసిస్తూ సత్యాన్ని గ్రహించలేకున్నానని, అట్టి సత్యాన్ని గ్రహించే బుద్ధి నిమ్మని ప్రార్థిస్తాడు. ఈ విధంగా శరణాగతిభావంతో తనకు సర్వస్వము శివుడేయని తనకు జ్ఞానాన్ని ప్రసాదించుమని, వృద్ధాప్యంలో కూడా ఆయనను వీడని బుద్ధి నిమ్మని వేడుకొన్నాడు. ఇట్టి భక్తిరసప్రధాపమైన చక్కని శతకాన్ని రచించిన ఈ కవి సాహిత్యాధ్యయనం విరివిగా చేసి వ్యాకరణఛందో గ్రంథాలను క్షుణ్ణంగా పఠించి ఇంకా ఎన్నో కృతులు రచించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

ఇట్లు
బుధజనవిధేయుడు
మీ శ్రేయోభిలాషి
ముద్దు రాజయ్య,
విశ్రాంత ఆంగ్లోపన్యాసకుడు
అష్టావధాని
G1, మ్యాక్ హైట్స్, నిజాంపేట్
హైదరాబాద్–500090
చరవాణి సం. 7330963281

సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ॥
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం ॥

అభిషేకప్రియుడికి పద్యాభిషేకము



"శివో అభిషేక ప్రియః" బుధవాక్కు. అలాంటి పరమశివుడికి ఈ "అరుణాచలవాసా" శతక పద్యసౌరభాలతో వారు అభిషేకము చేస్తూ చదువరులతో కూడా అభిషేకము చేయిస్తారు శతకకర్త శ్రీ వంగర శరచ్చంద్ర గారు. వారు ధన్యులు.

ప్రతిపద్యము భక్తిరసభరితము. దైనందిన జీవితమున మనసు భగవంతుడితో అనుసంధానము చేసే ప్రయత్నములో వచ్చే ఆటంకాలనన్నీ శతకకర్త జ్ఞానేశ్వరుడైన ఆ అరుణాచలవాసుడికి నివేదించుకొని వాటిని అధిగమించే జ్ఞానమొసగి శుభములు చేకూర్చుమని శతవిధాల ప్రార్థిస్తారు.

కం. జ్ఞానమునకు మూలంబ
జ్ఞాన తమస భంజన భవు శత నతులిట, సు
జ్ఞాన పథము, శుభము లొసగు
జ్ఞాని శరచ్చంద్రు పద్య శతకంబిదియే

ఈ శతకమునకు కందపద్య ఛందస్సు నెంపిక చేసుకున్నారు శరచ్చంద్ర గారు. కందపద్యము మొదటికే చిన్నగా ఉంటుంది, అది చాలదన్నట్టు ఎక్కడ లేనన్ని నియమాలు (Too many must's and must-not's). భావప్రకటన సంపూర్ణతకు ప్రతి శబ్దము తూచి తూచి ప్రయోగించాలి. "కందము వ్రాసినవాడే కవి, పందిని కొట్టినవాడే బంటు" అని ఊరకే అన్నారా? కందముతో ఇన్ని సవాల్లు ఉండగా, శరచ్చంద్ర గారు "అరుణాచలవాసా" అనే సాహసోపేత మకుటాన్ని పెట్టుకున్నారు.

ఎందులకు "అరుణాచలవాసా" సాహసోపేత మకుటము? 4వ పాదములో గణములు చూడండి.

1వ	2వ	3వ	4వ	5వ
		లఘువు లఘువు అరు	ణాచల	వాసా
"ణ" తో మాత్రమే యతి పొసిగే ప్రథమాక్షరము		నల గణము మాత్రమే వాడాలి	ణా–యతి స్థానము	

"గురువు గారు, మీరు నేర్పిన విద్యతో అరుణాచల వాసా అనే మకుటముతో 50 పద్యాలు వ్రాసాను, సవరణములు తెలుపండి" అని పంపిన పద్యాలలోని మకుటము మరియు 4వ పాదముల నిర్మాణము చూసి విస్తుపోయాను. ఇలాంటి సత్తా (capacity) ఉన్న శిష్యలను పూర్వము చూసిన వాడిన కనుక "శుభం, మకుటము చాలా బాగుంది, మిగతా పద్యాలు కూడా వ్రాసివేయండి" అని ప్రోత్సహించాను; 4వ పాదనిర్మాణములోని క్లిష్టత సూచించలేదు; కారణము ఈయనకు క్లిష్టత కాదు కనుక!

గురువుగా శరచ్చంద్ర గారి కార్యదీక్ష ఇక్కడ పంచుకొనుట నా కర్తవ్యము. నేను 2017 నుండి నడిపే మంథనీ పద్యసాధన బృందములో జనవరి 13, 2024 బ్యాచ్‌లో శరచ్చంద్ర గారు చేరారు. జులై 25, 2024 నాకు పంపిన WhatsApp Message: "అంతా మీ దయ గురువు గారు. ఐదు నెలల క్రితం అసలు గురువు లఘువు కూడా తెలియదు. నేటికి పది రకాల ఛందస్సులలో 30కి పైగా పద్యాలు రాయగలగటం ఆశ్చర్యంగా వుంది. మీరిచ్చిన ఉత్సాహం స్ఫూర్తి వల్లనే". ఇట్టి శరచ్చంద్ర గారు నా శిష్యగణానికే కాక ఛందోబద్ధపద్య రచన నేర్చుకొనదలచిన వారికందరికి గొప్ప స్ఫూర్తి.

శతకకర్త శ్రీ వంగర శరచ్చంద్ర గారి కృషితోబాటు వారి కుటుంబసభ్యుల సహాయసహకారాలు, ప్రోత్సాహము ప్రస్ఫుటిస్తున్నాయి. వారి కుటుంబంలో అందరిని ఆయురారోగ్య ఐశ్వర్యాలతో దీవించాలని నా యిష్ట దైవమయిన మంథనీ అగ్రహార మహాలక్ష్మి అమ్మవారిని మనసారా ప్రార్థిస్తున్నాను. ఇలాంటి కృతులను మరెన్నో రచించి సాహిత్యలోకానికి అందజేయాలని ఒక గురువుగా నేనాశిస్తున్నాను, సంతోషిస్తున్నాను. ఆశీర్వాదములతో...

 మ. అభిషేకప్రియుడైన శంకరుని రమ్యంబైన పద్యాలతో
అభిషేకమ్మొనరించు కావ్యమిదియే, ఆస్వాదమున్ జేసినన్
ప్రభవించున్ బహు భోగభాగ్యములు సద్వంశోన్నతుల్ హెచ్చుగా!
అభయమ్ముల్ భవు డీయుతన్, శరతు భార్యా పిల్లలన్ గావుతన్

బుధజనవిధేయుడు,

పద్యగురువు కొల్లారపు ప్రకాశరావు శర్మ

జీవనసాఫల్య పురస్కార గ్రహీత, వేదాంగాచార్య, పద్యశంకర, పద్యద్రోణ,
సాహితీశ్రీ, పద్యశిక్షకశిరోమణి
గ్రంథకర్త "కొల్లారపు పద్యరచనామృత బోధిని" (Free softcopy book)
స్థాపకులు "మంథనీ పద్యసాధన బృందములు" (Estd. 2017)
Free ఛందస్సు పాఠాలు WhatsApp: 01-703-728-4757
pkollaram@gmail.com
Richmond, VA, USA 22 September 2025

శ్రీ వంగర శరత్ చంద్ర గారు తనలోని ఈశ్వర భక్తిని ఈ శతక రూపములో చూపారు.

వారు వ్రాసిన కొన్ని పద్యాలు

మనమున జ్ఞాగ్నిని తమం
బను నివురును గప్పుకొనగ, భవసాగరమున్
నిను మరచి యీదు చుండెడి
నను కరుణించగ వలె అరుణాచలవాసా!

అని వేడుకొనుచు

బ్రోచెదవని నీ చెంతను
నే చేరితి, వదలిన నను, నీకే యపనిందౌ

అని భగవంతునినే గడుసుగ హెచ్చరిస్తూ

వలువలు మార్చు విధంబున
పలుమరు తనువులు విడచుచు పాట్లను పడితిన్
కలలైన జన్మములతో
నలసితి! ముక్తినిడుమ! అరుణాచలవాసా!

అంటూ శరీరము ఆత్మ వేరు అనే విషయాన్ని తేలిక పదాలతో విశదపరుస్తూ ముక్తిని ప్రసాదించమని వేడుకున్నారు

ఇటువంటి భక్తి యుతమైన శతకాలింకెన్నో వీరినుండి వెలువడాలని కోరుకుంటున్నాను.

శ్రీసత్య పర్వతనేని

విన్ఫీల్డ్, ఇలినాయ్, యు.ఎస్.ఏ

ఓం శ్రీ అరుణాచలేశ్వరాయ నమః

కవి వర్యులు శ్రీ వంగర నాగదుర్గా శరచ్చంద్ర గారు భక్తి రససామ్రాజ్య మూర్తి. వారు ఉపాధ్యాయ, పద్యబ్రహ్మ, పద్య శిక్షక శిరోమణి, బ్ర.శ్రీ కొలస్కరం ప్రకాశరావు శర్మగారి ప్రియ శిష్యులు, వారి గ్రహణా శక్తి, ధారణా పటిమ అపూర్వము. అనతి కాలంలోనే "అరుణాచలవాసా" అను శతకమును భావ పుష్టితో భాషా బంధురముగ కూర్చిన మేధా సమ్పన్నులు. వారి ఆంధ్ర భాషాభిమానము గొప్పది. వారి శతకమునకు ముందుమాట వ్రాయు సదవకాశము నాకు కల్పించినారు. ధన్యవాదములు.

గురుపరంపరను స్మరించి, స్వవినయముతో శంఖుస్థాపన చేసి శతక రచనా సంప్రదాయమును అనుసరించినారు. దైవ ప్రార్థనలో శ్రీగణేశ, గాయత్రి, దుర్గా, దక్షిణామూర్తి, శివ సుబ్రహ్మణ్య నందీశ్వరాదులను కొలిచి, గురు ప్రార్థన, పితృ దేవతా స్తుతిలో దైవ గురువే పితృ గురువని సంస్తుతించినారు. ఈ శతకమందున్న పద్యములు అన్నియూ పఠితలకు ఆనందాన్ని కల్గించేవే. ప్రతి పద్యమును ముగ్ధ పద అర్థ భావములనిచ్చి కావ్యమును అలంకరించి వ్రాసిరి. పండితులకును రంజకముగా ... అందములు చందముగా కూర్చి దిద్దినారు.

కం. టక్కరి ఇంద్రియములచే
చిక్కి యలసి నీ పదముల చేరితి నయ్యా!
గ్రక్కున నా మొరలన్నియు
నక్కజమ్ము కానక విను! అరుణాచలవాసా!!

వంటి దుర్భర తాపసయుక్త పదార్థాలలో/ శివుని పైతమకు గల భక్తి స్నేహ మాధుర్యాన్ని కురిపించారు.

కం. భ్రమరము కుసుమము మకరం
దము గ్రోలి తనివి దీరయు విధముగా నేను
న్నమ్ముటమగు నీదు ధ్యానము
న మునగ వరమిడ వలె! అరుణాచలవాసా!

వంటి అనేక పోస్టర్లు (8) విరివిగా వ్రాసి పద్యములకు అందములద్దినారు

ఇటీవల 54వ పద్యంలో శివస్తుతి వర్ణనా పాండిత్యాన్ని చూపినారు ఇటువంటి ప్రముఖ పద్యములలో శివలీలకము సాంబశివ పాఠకులను మళ్ళీ మళ్ళీ చదివించునటులో సందేహ లోపమేమైననూ కానరాదు.

శ్రీ శరత్ చంద్ర గారి కలము నుండి భక్తి ద్యోతకములగు మరిన్ని కావ్య రత్నములు వెల్లడాలని మనసారా కాంక్షిస్తూ శుభాభినందనలు

శ్రీ విశ్వావసు ఆశ్వయుజ బ..
తదియ (అట్లతద్ది) గురువారం
తేది: 9.10.2025
CELL: 9440495525

రంగి సత్యనారాయణ:
సేవానివృత్త సంస్కృతోపాధ్యాయుడు
కేంద్రీయ విద్యాలయము
భాగ్యనగరం.
భారత్

R. Satyanarayana
RANGI SATYANARAYANA
HON' PRESIDENT AWARDEE
TEACHER, KVS (Retd.)

ఓం శ్రీ గణాధిపతయే నమః ఓం శ్రీ మాత్రే నమః

శ్రీ అరుణాచలేశుని దర్శనమ్



చిరంజీవి శ్రీ వంగర నాగ దుర్గా శరచ్చంద్ర పిన్న వయస్కుడు, సాహిత్యము పై మిక్కిలి మక్కువ కల్గిన యువకుడు, ఈశ్వరార్చకుడు, పరమేశ్వరుని ప్రియభక్తుడు. అరుణాచలవాసా! అనే మకుటంతో అరుణాచలేశ్వరునిపై కందము ఛందములో శతకమును వ్రాయుటకు పూనుకొనుట నిజంగా ఓ సాహసమే. ఎందుకంటే, నాల్గవ పాదములో యిక్కడ యత్యక్షరము 'ఐ' గా ఉంది, దానికి సరియగు అక్షరాన్ని పాదము మొదటి అక్షరముగా వేసుకోవడం కొంచెం కష్టమే మరి.

కం. కందము నందున పరమా
నందంబౌ తత్త్వమునిటు నచ్చిన రీతిన్
విందగు ఘనమౌ సంపద
నందించుచు వంగర కవి హ్లాదము గూర్చెన్!!

ఈ శతకాన్ని పరమపూజ్యులు శ్రీ శంకర భగవత్పాదులను మరియు తాత, తండ్రులను స్మరించుకుంటూ, వారి దివ్యాశీస్సులతో శ్రీ శరచ్చంద్ర ప్రారంభించిన తీరు అమోఘం. అలాగే, సనాతన గురు పరంపరను, మన ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను మరువకుండా గురుభక్తితో నమస్కరించడము కవిలోని సంస్కారమును తెలియచేస్తుంది. **'ఓం నమహ శివాయ'** తో దైవప్రార్థన మరియు పలు గురు ప్రార్థనలు చాలా చక్కగా ఉన్నాయి.

వీరి పద్య గురువులు, పద్య శిక్షణా ద్రోణులు, బ్రహ్మశ్రీ కొల్లారపు ప్రకాశరావు శర్మగారు, తమ ప్రియశిష్యుని తీర్చిదిద్దన తీరు ప్రశంసనీయము. గురువుకు తగిన శిష్యునికి గురు ప్రోత్సాహం అది..గురుదక్షిణ యిది.

శా. విద్యాచార్యుల శిక్షణామృతమిలన్ విద్యార్థిగా గ్రోలుచున్,
విద్యాభ్యాసము సేయుచున్ వినయమే విజ్ఞాన భాండమ్ముగా
సద్యస్ఫూర్తిగ పద్యసేద్యమునిటన్ సద్భక్తితోఁ జేసి నై
వేద్యంబోయనఁ బాదపద్మములకున్ బ్రీతిన్ సమర్పించె తాన్!!

'మది చీకటిని పారద్రోలి నాలో జ్ఞానాగ్నిని రగిలింపమని' సాక్షాత్తూ ఆ అరుణాచలేశుని వేడుకుంటూ ఈ శతకాన్ని కవి ప్రారంభించారు..శుభారంభం.

నా అజ్ఞానాన్ని తొలగించి, "నీవే నేను, నేనే నీవనే" అద్వైతమును తెలియజేసి, నను కృతార్థుని చేయమని సముచిత రీతిని ప్రార్థించారు యువకవి.

మహిలోని మనుజుల విష ప్రవృత్తిని సమూలంగా నాశము చేయమని ఆ శ్రీ అరుణాచలేశుని కోరిన దాన్నిబట్టి చూస్తే, కవికున్న సామాజిక బాధ్యత తెలియజేస్తోంది.

'ఎదనంతయు నీ రూపము, మదినంతయు నీ స్మరణ..' అంటూ తనలోని భక్తి భావమును కవితాత్మకంగా చెప్పుకుంటూ, నంది వంటి ప్రమథ గణాలవలె నిరతము నీ చెంతనే ఉండి నిన్నే ఆరాధించు మహాభాగ్యము నొసంగమని వేడుకొన్న విధము కవిలో దాగియున్న ఓ సంకీర్తనాచార్యుని గుర్తుచేసింది.

అయస్కాంతము ఉక్కును అతికినట్లు నేను నిత్యము నీ ధ్యానములోనే ఉంటానని మాటయిస్తూ, కొండంత కరుణను నివురుగప్పిన నిప్పులా దాచిన ఓ దేవా! మాపై దయ చూడుడు అని వాపోయాడు కవి.

'మాయామేయ జగంబె సత్యమని' నమ్మ నాకు నీ మమతను ప్రసాదింపుము తండ్రీ! అని అంటూ, నీ శరణుగోరి వచ్చిన నీ దాసుని రక్షింపుమని వేడికొంటూ సాగిన పద్యసుమాలు నిక్కువముగా ఆ అరుణాచలేశునికి పూజార్హములు, సందేహము లేదు.

కవి హృదయం నిర్మలం, ఓ చిన్న పిల్లవాడు తన తల్లిదండ్రులను అడిగినట్లు యిక్కడ తను నిక్కచ్చిగా హృదయావిష్కరణ చేసుకున్నారు. అద్భుతరీతిని భగవంతుని ప్రార్థిస్తూ నిరంతరమూ సుగుణాన్ని ప్రసాదించమని కోరుకున్నారు. మనిషిలోని తాత్త్విక చింతనకిది తార్కాణం.

'నాలోనే నీవున్నావని తెలియనైతిని, నా ఈ అజ్ఞానాన్ని పటాపంచలు చేయుమయా!' అని అంటూ, సంసార సాగరంలో మునగడమే జీవితపరమార్థమని అనుకుంటూ ఉన్న నాలోని మూఢత్వాన్ని తక్షణము పారద్రోలుమా అని ఆర్ద్ర హృదయముతో అరుణాచలేశుని మొరపెట్టుకున్న తీరు హృదయాలను కదిలించివేసే గొప్ప కవితామృతమే!

ఈ దేహముపై మోహము తొలగుటకు మరియు దేహపు వాసనలు లేకుండా చేయుటకు **'త్వమేవాహం'** అనే ఆత్మబోధ చేస్తూ, నాకు ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించమని

ఆ అరుణాచలేశుని చివరగా మనసారా ప్రార్థిస్తూ, కవి ఈ శతక రాజాన్ని క్లుప్తంగా, అత్యద్భుతంగా ముగించారు..

ఈ శతకములోని అన్ని పద్యాలకు తగిన విధంగా చిత్రాలను గీచి అందించిన తీరు ఆకట్టుకుంది, మనసుకు హత్తుకున్నట్లున్నాయి ఈ చిత్రాలు..

కవి, ప్రతి పద్యంలోనూ తన కవితాధారను కురిపించి పాఠక లోకాన్ని ఆనందడోలికలనూగించారు. పదబంధములు మరియు వాటి ప్రయోగాలు ఈ శతకములో సందర్భానుసారంగా సముచితంగా ఉన్నాయి.

ప్రతీ ఒక్కరు తప్పక చదువదగిన శతకమిది.

ఈ శతకానికి ముందుమాట వ్రాయమని నన్ను శ్రీ శరచ్చంద్ర గారు అడగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా ఈ సమీక్షలో ఎలాంటి దోసములున్ననూ కవులు, పెద్దలు, పండితోత్తములు, పద్య ప్రేమికులు మరియు పాఠకులు పెద్ద మనసుతో మనసారా మన్నించ ప్రార్థన. చిరు ప్రాయములోనే తన అమోఘమైన భక్తి భావముతో, అకుంఠిత దీక్షతో **'అరుణాచలవాసా'** అనే మకుటంతో ఈ శతకాన్ని అందించిన శ్రీ వంగర నాగ దుర్గా శరచ్చంద్ర గారిని హృదయపూర్వకముగా అభినందిస్తున్నాను.

ఈ చిరంజీవికి శ్రీ అరుణాచలేశుని స్మరణపూర్వకముగా ఆశీస్సులనంద జేయుచున్నాను. నిరంతర అధ్యయనము, సాధనతో శ్రీ శరచ్చంద్ర భవిష్యత్తులో మేటికవిగా విరాజిల్లి, ఆదర్శవంతంగా నిలుస్తారు.

శతమానం భవతి! శుభం ! విజయోస్తు !!

భవదీయుడు

పి.ఎల్.నాగేశ్వరరావు
విశ్రాంత సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగి
కొండాపూర్, హైదరాబాదు.
మొబైల్ : 9290006477

తెలుగు సాహిత్యానికి అమూల్యాభరణంగా గుర్తింపు పొందినది శతక సాహిత్యం. భక్తి ప్రధానమైన శతకాలు వ్రాసిన కవులకు ప్రత్యేకమైన స్థానం గలదు. పన్నెండవ శతాబ్దంలో ప్రారంభమైన విశిష్ట ప్రక్రియ ఇది. శరచ్చంద్ర చక్కని ఆధ్యాత్మిక భావ గంభీరం ఈ శతకంలో సుస్పష్టమయ్యింది. అరుణాచల శివుని గురించి వ్రాసిన చక్కని చిక్కని శతకమిది. తనకు వారసత్వంగా లభించిన శైవవాఙ్మయం స్ఫూర్తిని తనలో ఇముడ్చుకున్న అంతరంగ మథనం ఈ రచనకు ప్రేరణ. "అరుణాచలవాసా!" అన్న మకుటంతో సాగిన శతకమిది. కందములో వెలువరించిన భావార్థంలో గాంభీర్యాన్ని మనం గమనించవచ్చు. శ్రీ రమణ మహర్షితో ప్రారంభమైన అరుణాచలేశ్వరునిపై ప్రార్థన గీతాలు విస్తరిస్తూ ఇప్పుడు వంగర శరచ్చంద్రుని శతకం ద్వారా విపులీకరించబడి విబుధ వరుల ప్రశంసలనందుకోవడం అభినందనీయమనే చెప్పుకోవాలి. మనసా, వాచా, కర్మణా హృదయంగమైన భావాలను ఆవిష్కరించిన ఘనత వీరికి దక్కింది. ఎన్నో విషయాలను ఆధ్యాత్మికతను అనుసరిస్తూ అందమైన కందంలో మకరంద మాధురీ మహిమను ప్రవచించాయనే మనం గ్రహించాలి. శతకం ప్రారంభంలో వివిధ దేవతల స్తుతితో ప్రారంభమై పితృదేవతలు, ఋషి ప్రార్థన, గురువుల స్తుతితో సాగుతుంది రచన. ఇవన్నీ ప్రాతస్మరణీయులైన కవులు అనుసరించిన శుద్ధమైన మార్గమిది. సమసమాజంలో పెరుగుతున్న సమస్యలను పరిష్కరించేదిశగా అరుణాచలవాసుని అభ్యర్థిస్తున్నాడు ఈ కవికిశోరం. అయస్కాంతము ఉక్కు ముక్కను ఆకర్షించినట్లుగా నిన్ను నమ్మి నీ దరికి చేరుకునే భక్తులను హత్తుకుని ఆదరించమని విన్నవిస్తున్నాడు (పద్యం:16). జీర్ణమైన వస్త్రాన్ని విడిచి నూతన వస్త్రాలగు మరొక క్రొత్త జన్మతో నీదరికి చేరాను నన్ను కాపాడమని వేడుకుంటాడు కవి. (పద్యం:30). 33వ పద్యంలో మాయామేయ జగమ్ము నిశ్చయమని సంభావించి అది తప్పని తెలుసుకున్న జ్ఞాన సముపార్జన కవిలో సంపూర్ణంగా కనిపిస్తుంది. ఆత్మార్పణ అంతటా విస్తృతంగా ద్యోతకమవుతుంది. మరిన్ని భావ సంభరితమైన శతకాలను మరిన్ని వృత్తాలలో తెచ్చి కీర్తిగడించాలని అభ్యర్థిస్తున్నాను.

ఇతి శివం

– రావెల పురుషోత్తమరావు (అమెరికా)

అంకితము



సీ. విశ్వ సృష్టికి మూల బీజమౌచుండు, స
ద్యోజాత ముగముతో జ్యోతలందు
కొనెడివాడెవ్వడు? కోటి సూర్యప్రభా
భాసమై చిద్రూప వామదేవ
మొగముతో కరుణించు పుంగవుడెవ్వడు?
జ్ఞానమునిడఘోరిగాను, తత్పు
రుషునిగానంద స్వరూపమై నిలచి, ఈ
శానునిగా సర్వ శాస్త్రములక
ధిపతియౌ వానిని దీక్షతోడ నమించె
దను నిరతము నను దయగొనంగ

తే.గీ. పంచముఖుడౌచు నిలచిన పరమ శివుని
మదిని నిల్పుచు శతకమును దిట మనము
తోడ నేనంకితమునిచ్చు వాడనైతి
ని యరుణాచలవాసా! యని నమములిడి

దైవ ప్రార్థన



శా. **ఓం**కారార్థ విశేష జ్ఞానమునకై, ఒజ్జాకృతిన్నిల్చియున్
టంకారంబున జ్ఞానధార సమకూడ్చంగా మహర్వ్యాళికిన్
హంకారంబను రుగ్మతంబెడల జేయంగాది వైద్యుండవే!
శంకల్దీర్చుచు జ్ఞాన భిక్షనిడు! ఈశా! దక్షిణామూర్తివై!



చ. **న**దరున నిల్తువే తలచినన్ పరమేశుని వల్లభాదటం
బు ధరణికంతయున్ శుభ ప్రమోద మొసంగునటంచు పల్కుచున్,
ముదమును గూర్చు పార్వతికి ముద్దుల పట్టివి విఘ్ననాయకా!
మృదుల కవిత్వ పాటవము మృక్షము జేయుచు నాకొసంగుమా!



తే.గీ. **మహ**తియౌ మాదు జన్మము స్మరణ జేయ
నీదు నామము నిరతము నిష్ఠతోడ,
కామిత వరదాయినివి దుర్గవు కరుణను
కావవే మము! మా కులదేవివి గదె!



కం. **శి**ఖివాహనప్రియుడవే,
శిఖరాగ్రావాసములను సేదగొనుదువే!
సఖుడవుగా తలచెద, నా
లిఖితము కాచి నిలు శాంకరి ప్రియ'కుమారా'!




సీ. **వా**హనమై నిల్చి పరమశివుని మ్రోయు
భాగ్యంబు చొరగొనె భక్త నంది
కేశుడు, శివపూజకే నిరతము తపిం
చెడు రాత తా జేకొనెడిన వారు
భృంగి, చండీశ్వరులుం, గైకొనెను తాను
శివధర్మ పరిరక్షణ విధియనుచు
వీరభద్రుడు, క్షేత్రవీరునిగా నిల్చి
కాలభైరవుడును కావలయ్యె!




తే.గి. ప్రమధ గణముల పోటి తప్పదు గదా ని
రతము సాలోక్య సామీప్యలకును! శాశ్వ
తమగు మోక్షము నీయుమా! తత్వబోధ
ను యొనరించ ధన్యంబగును గద! జన్మ!

తే.గీ. **య**ముని సైతంబు సంహరించి ముని బాలు
ని ఉసురును శాశ్వతమొనర్చి, నీవు భక్త
ప్రియుడవను పట్టమునుపట్టె! దయనిడుటయు
నీదు ధర్మంబు మాపైన నిరతము! శివ!

ఋషి ప్రార్థన



సీ. అరయగను మునియంగిరశుని స్మరణలో
నిలిపెద సత్యాత్మనెరుకకై త
గు పథమున నిలుప, గురుడు బృహస్పతి
ధ్యానమొనర్చెద ధర్మ పథము
న చరించెడి స్మృతి జ్ఞానమునివ్వ, నిత్యమా
రాధననొనరింతు రాగపూర్వ
హృదయముతో గోత్ర వృద్ధికి మహితాత్మ
యగు భరధ్వాజునకు గమకముగ



తే.గీ. కల్ప సూత్రములందించి, కర్మ మార్గ
మున నిలపగనాపస్తంబ మునిని స్మరణ
జేసెద, స్మరణచే రక్ష జేసె మంత్ర
మునకు ద్రష్టయౌ కౌశికముని ఋణంబు
దీర్చ నెవ్వరికి తరము? దేవ ఋషుల
కును, సకల ముని గణములకును నమింతు!

పితృ దేవతా ప్రార్థన

వంగర వంగర
కావ్యశాస్త్ర వినోదేన కాలో గచ్ఛతి ధీమతామ్

తే.గీ. వైదికమతానుచారులై, పరమ స్మార్తు
లౌచు, నిత్య కర్మానుష్ఠులౌచు నిలిచి,
తెనుగు భారతికి పదార్చనను, శివార్చ
నయుసలిపినట్టి 'వంగరా'న్వయ పితరుల
ను స్మృతిపథమున నిలిపెదను ముదముగను

తే.గీ. 'తాడికొండ'ను కర్మ క్షేత్రముగ నెంచి
'వేణుగోపాల స్వామి'ని పేర్మితోడ
పూజజేయ వర ప్రసాదమై జననము
నొంది 'గోపాలకృష్ణయ్య' నందనముగ
జేసె 'రామయ్య' వంశంబు సిరులు పొంగ



తే.గీ. కనక దుర్గయే కామేశ్వరనగ, భవుడు
తానుగా వచ్చి నడయాడె తాడికొండ
యందు గోపాలకృష్ణయ్యయౌచు, కూర్మి
విబుధులందరు మెచ్చిన వివిధ గతుల
నాదు ప్రపితామహులకివే నత శతములు!

సీ. నుదుట విభూదిని నులుము రజతగిరి
వాసుని కైంకర్య వర ప్రసాద
మౌనని గాబోలు! మందస్మిత వదను
డతడు, దండంబు విడచిన దండ
పాణి యితడగునే! వంగర శ్రేష్టి సు
బ్రహ్మణ్య శాస్త్రి సుబ్రహ్మ తత్త్వ
సార విచార విశారదుడగుచును
తల్లిదండ్రులకు ముదమును గూర్చె



తే.గీ. మనసు నానంద బరచెడి మమత నొసగు
విమలకు పతిగ నడయాడి, వేల్పుమెచ్చు
శాంకరీ పదార్పితమని శతకరత్న
మును నొసగిన పితామహులను నమింతు

తే.గీ. తొలి గురువులై నడతయును తోగదోచి
నేర్పిన పితృద్వయంబును నేను స్మరణ
జేసెద శతకారంభము జేయ మునుపు
నిరతమాశీర్వచనములు నింపుగ నిడ!



గురు ప్రార్థన



ఉ. బాలురిగా జగత్పతులు ప్రాకగ, తల్లిగ స్థన్యమిచ్చి తా
లాలన జేసె అత్రిముని లాలితయౌ అనసూయ సాధ్వికిన్
బాలుడు, నిర్వికారుడు, తపస్వియు జ్ఞానమిడే గురుండగున్
వేడుకొనంగ వేగిరము విచ్చెయు దత్తునికిన్ నమించెదన్!




కం. శ్రుతి స్మృతి పురాణముల పరి
ణతులై, అద్వైత చేతనా క్రాంతిగ ష
ణ్మతముల స్థాపన జేసిన,
యతి వర్యులు శంకరునికి అంజలిమోడ్తున్!



కం. శారద నిత్యారాధక,
శారద కరుణా ప్రపూర్ణశాలికి, భవ శృం
గేరీ పీఠారూఢా
'భారతి తీర్థ' పదములకు ప్రణతులుమోడ్తున్!



కం. అంచితమైనపురంబగు
కాంచిపురపు కామకోటిఘనమగుపీఠం
బెంచిన సరస్వతులకే
నంచనమొనరింతునిత్యమానందముగన్!



తే.గీ. రమణుడట! మౌనియట! తా విరాగియట! అ
రుణగిరీశునికి వివాహ మణుల మాల
లను పదములతో గూర్చిన లలిత హృదయ
సఖుడట! నిను నీవెరుగుటే సుఖమనెనట!
యట్టి మునిని కొలిచెద నత్యంతముగను!

అరుణాచలవాసా!



1) కం. మనమున జ్ఞానాగ్ని తమం
బను నివురును గప్పుకొనగ, భవసాగరమున్
నిను మరచి యీదుచుండెడి
నను కరుణించగవలె! అరుణాచలవాసా! ౧

ముఖ్య"పదార్థాలు": జ్ఞానాగ్ని = జ్ఞానమనే అగ్ని; తమంబను = చీఁకటనే; నివురును= బూడిద; భవసాగరమున్ = ప్రాపంచిక జీవిత సముద్రము (సంసారము); అరుణాచలవాసా = అరుణాచలవాసుడవైన శివ!

భావము: ఓ అరుణాచలవాసా! నా మనసులోని జ్ఞానాగ్ని, చీఁకటనే నివురు గప్పి మరుగునపడి యుండుటచేత, నిన్ను మరచిపోయి సంసార సాగరములో యీదుతున్న నన్ను కరుణించి కాపాడుమా!



2) కం. "నేనే నీవని నీవే
నేనని" తెలియక తిరుగుచు నేనలసితినే!
జ్ఞానార్థిని! పంచముఖుం
డా! నీ స్మరణమె గతి! అరుణాచలవాసా! ౨

ముఖ్య"పదార్థాలు": జ్ఞానార్ధిని = జ్ఞాన సముపార్జన కోరువాడు; పంచముఖుండా! = సద్యోజాత, వామదేవ, అఘోర, ఈశాన, తత్పురుష అనే ఐదు ముఖాలు కలవాడు;

భావము: ఓ అరుణాచలవాసా! నీవే నేను, నేనే నీవనే సత్యాన్ని గుర్తించ లేక, ద్వైత భావనతో వెదుకుచు అలసివున్న నన్ను అద్వైత స్థితికి చేర్చి నా జ్ఞానార్తిని శాంతింప జేయుటకు నీ నామ స్మరణమే గతి!



3) కం. నను భవబంధపు విముఖుని
గ నీ దరిని జేర్చి నీకుగల వాత్సల్యం
బును జూపి ముక్తి భావము
న నను నిలిపితివి గదె! అరుణాచలవాసా! ౩

ముఖ్య"పదార్థాలు": భవబంధపు = సంసార బంధనముల; విముఖునిగ = విరతునిగ; వాత్సల్యంబును = వాత్సల్య భావమును; ముక్తి భావము = మోక్ష జ్ఞానము; నిలిపితివి గద! = నిలిపావు కదా!;

భావము: ఓ అరుణాచలవాసా! భవబంధాల నుండి నన్ను విముక్తుడిని చేసి కైవల్య మొసగుదువని నిన్ను వేడగ ముక్తి భావమున నన్ను నిలిపితివి గదా!

4) కం. బ్రోచెదవని నీ చెంతను
నే చేరితి, వదలిన నను, నీకే యపనిం
దౌ, చల్లగ మా వరదుం
డౌచునభయమిడ వలె! అరుణాచలవాసా! ౪



ముఖ్య"పదార్థాలు": బ్రోచెదవని = రక్షించెదవని; వరదుండౌచు = కాపాడువానిగా;

భావము: ఓ అరుణాచలవాసా! నన్ను బ్రోచు భారము నీదేయని శరణాగతి చేసిన నన్ను విడచిన యెడల ఆ అపనింద నీదేయగును.

5) కం. బోయని ఎంగిలి యలవా
టాయనె, గిరులన్ నివాసుడైతివి, నీకు
న్నీయుటకు రిక్త హస్తుం
డైయుంటి, దయగనవె! అరుణాచలవాసా! ౫



ముఖ్య"పదార్థాలు": బోయని = బోయవాని; రిక్త హస్తుండైయుంటిని = ఏమిలేని చేతులతో వున్నాను;

భావము: ఓ అరుణాచలవాసా! ఒకనాడు బోయ తిన్నడు నిర్మల భక్తి భావనతో తన ఎంగిలి నీకు నైవేద్యముగా సమర్పించగా యది స్వీకరించావు. మరల అంతటి భక్తి భావన చూపువారి కొరకు గిరుల పై నివాసముండి వెదకుచున్న నీకు యీయుటకు రిక్త హస్తుడనై నిలచి యున్న నా పై దయచూపుమా!

6) కం. జనని మమతనే తలపిం
చు నీదు వాత్సల్యమందు చోక్షత జూపం
గనవద్యమగు కరుణతో
నను పాలింపగ వలె! అరుణాచలవాసా! ౬



ముఖ్య"పదార్థాలు": చోక్షత = మిగుల స్వచ్ఛమైనది; అనవద్యము = దోషరహితమైన

భావము: ఓ అరుణాచలవాసా! నీ భక్తులపై నీవు చూపు వాత్సల్యము తల్లి ప్రేమవంటి స్వచ్ఛమైనట్టి శ్రేష్ఠమైన కరుణ నా యందు చూపుమా!



7) కం. విడువక భవ బంధపు వాం
ఛలు, మనమున జపతపములు సలపని నాపై
కడు దయ జూపుచు, నీ దరి
నడకకు దారి నిడవె! అరుణాచలవాసా! ౭

భావము: ఓ అరుణాచలవాసా! తీరని కోరికలకై ప్రాకులాడుచు, జప తపములేదియూ చేయని నాకు దారి చూపి నీ దరికి చేర్చుమా!



8) కం. సుందరమగు నీ రూపము
నందు మనమును నిలిపెద, సునాయాసముగా
నంది గణంబుల వరుసను
నందనమొనరింపవె! అరుణాచలవాసా! ౮

ముఖ్య"పదార్థాలు": నందనము = సంతోషించునది

భావము: ఓ అరుణాచలవాసా! నీపై చూపు మరల్పక నీ సేవలో తరించు నంది వంటి ప్రమథ గణ సమూహములో నిరంతరము నీ సుందర రూపాన్ని ధ్యానింప నన్ను కూడా దరి చేర్చుకొనుమా!



9) కం. కారుణ్యము జూపుచు గో
చార ఫలాతీత సుఖదచరులుగ మలచే
తారియగు నీవు కరుణన్
నా రేఖను మార్చవె! అరుణాచలవాసా! ౯

ముఖ్య"పదార్థాలు": తారి = ఆటాడించెడు సూత్రధారి;

భావము: ఓ అరుణాచలవాసా! జీవితమనే నాటకము ఆడించుచు గోచార దశల పేరున కర్మ క్షయము జేసి ముక్తినిడు నటనా సూత్రధారివి నా తలరాత మార్చుము!

10) కం. ఎదనంతయు నీ రూపము,
మదినంతయు నీ స్మరణను మరువక జేయం
గ దురత్యయమౌ నీ కరు
ణ దొరకొన వరమిడవె! అరుణాచలవాసా! ౧౦



ముఖ్య"పదార్థాలు": దురత్యయము = చేటులేనిది;

భావము: ఓ అరుణాచలవాసా! నీ కరుణా కటాక్షము నా యందుంచి, యెదలో నీ రూప ధ్యానము, మదిలో నీ నామ స్మరణ ఎల్లప్పుడూ యుండునట్లు నన్ను అనుగ్రహించుమా!

11) కం. టక్కరి ఇంద్రియముల చే
జిక్కి, యలసి నీ పదముల చేరితినయ్యా!
గ్రక్కున నా మొరలన్నియు
నక్కెత్తుకొనక విను! అరుణాచలవాసా! ౧౧



ముఖ్య"పదార్థాలు": గ్రక్కున = శీఘ్రముగా; నక్కెత్తుకొను = విసుగుగొను

భావము: ఓ అరుణాచలవాసా! ఇంద్రియ సుఖాలకు బానిసనై అలసి నీ చెంత జేరిన నా మొరలను విసుగు చెందకుండా వినుమా!

12) కం. ఏకాత్మయై జగమునం
దేకాకృతితో నిలచిన దేవుండవు! నా
లోకము నీవైయుండగ
నాకము నాకేలర? అరుణాచలవాసా! ౧౨



ముఖ్య"పదార్థాలు": నాకము = స్వర్గము

భావము: ఓ అరుణాచలవాసా! జగమంతా నిండియున్న నీవే నా సర్వస్వమని తలచిన నాకు వేరొక స్వర్గము యెందులకు?

13) కం. మినుసిగదేవర! నీదు న
టనముల వీక్షించునట్టి ఠాకురులకు క
ల్గినదర్శన భాగ్యంబును
ననుపున నా కొసగవె! అరుణాచలవాసా! ౧౩



ముఖ్య"పదార్థాలు": మినుసిగదేవర = వ్యోమకేశుండు, శివుండు; నటనము = లీల, ఠాకురుల = దేవతల, ననుపున = అనురాగము

భావము: ఓ వ్యోమకేశుడవైన అరుణాచలవాసా!నీ లీలను దర్శించే దేవతలకు కలిగిన భాగ్యము నాకు కుడా అనుగ్రహించవయ్యా!



14) కం. నాయనగా నిను తలచిన
నా యెడ, నీ భక్త నాయనారుల రీతిన్
తీయమగు ప్రేమ జూపుచు
న్యాయపు కృప నిడ వలె! అరుణాచలవాసా! ౧౪

ముఖ్య"పదార్థాలు": తీయము = ఆసక్తి

భావము: ఓ అరుణాచలవాసా! వివిధ రీతులలో నిన్ను ఆరాధించిన భక్త నాయనారుల సమూహమున నిన్ను తండ్రిగా భావించు నన్ను గూడా చేర్చుకొనుమా!



15) కం. కన్నులకు రెప్పవై, నా
కన్నీరు తుడువగ సహజుగ నిలబడుటయే
యన్నగ నాకది దన్నగు
నన్నిక కృపను గనవె! అరుణాచలవాసా! ౧౫

ముఖ్య"పదార్థాలు": సహజ = తోడంబుట్టినవాండు; దన్ను = ఆసరా, బలము;

భావము: ఓ అరుణాచలవాసా! కష్ట సమయమున నా కన్నీరు తుడుచు సోదరునిగ నీవు నిలచియుండ అంతకు మించి ధైర్యము వేరొకటియుండునా!



16) కం. ఉక్కునయస్కాంతము దరి
జొక్కి దృఢాప్తిగ నిలిచెడి చూడ్కి మదిని తా
జిక్కినదగు నీ నామము
నక్కరతో పలికెద! అరుణాచలవాసా! ౧౬

ముఖ్య"పదార్థాలు": దరిజొక్కి = దగ్గరకి వచ్చి; చూడ్కి = అవలోకనము; అక్కర = అపేక్ష;

భావము: ఓ అరుణాచలవాసా! అయస్కాంతము ఉక్కును ఏ విధముగా గట్టిగా ఆకర్షిస్తుందో అట్టి విధమున నా మనమున దృఢముగ నీ నామ స్మరణ చేయుదును.

17) కం. నగమంత కరుణ గల్గియు
నిగుఱడుగున నిలచినట్టి నిప్పుకణిక రీ
తిగ గారామును దాచుట
నగజాప్రియ! న్యాయమె? అరుణాచలవాసా! ౧౭



భావము: ఓ అరుణాచలవాసా! కొండంత కరుణ కలిగి గూడా దానిని నివురు గప్పిన నిప్పులాగా వుంచి పైకి నా యందు కనబరచకుండా యుండుట నీకు న్యాయమా!

18) కం. కాంతులిడు దివ్య మణిగా
కంతువు లోనంధకారక పురులు మాపన్
మంతువు నీయగ దలచిన
నంత కృపాకరుడవె! అరుణాచలవాసా! ౧౮



ముఖ్య"పదార్థాలు": కంతువు = హృదయము; మంతువు = జ్ఞానము;

భావము: ఓ అరుణాచలవాసా! తలచినంతనే కాంతినిచ్చు దివ్య మణిగా నిలచి నా హృదయములోని అంధకార స్వభావమును తొలగించి జ్ఞానము నిచ్చు కృపాకరుడవు నీవు గదా!

19) కం. మనసా వాచా కర్మల
అనునిత్యము భక్తి తోడ నతులిత యారా
ధన సలుపు ధన్యుని వలెను
నను మలచు గురువవె! అరుణాచలవాసా! ౧౯



భావము: ఓ అరుణాచలవాసా! నాకు గురువుగా నిలచి అనునిత్యము భక్తితో, మనసా వాచా కర్మణా నీ ఆరాధనలో ఉండునట్లు మలచుమా!

20) కం. పాలితుడవనుచు నమ్మితి
పూలను ఫలములను దెచ్చి పూజలు జేతున్
నీ లింగమునకు! భక్తిని
నాలో నిల్పగ వలె! అరుణాచలవాసా! ౨౦



ముఖ్య"పదార్థాలు": పాలితుడ = రక్షించువాడు

భావము: ఓ అరుణాచలవాసా! నీ యందు నమ్మకముతో ఫలములను, పుష్పములను తెచ్చి శివలింగార్చన చేసే నాలో ధైర్యము నింపి నడుపుమా!



21) కం. నమక చమకములు నిత్యము
శ్రమంబనకనేకరువుగ శ్రావ్యముగా నా
గమరీతులుగ పఠించుచు
నమించెద దయగనవె! అరుణాచలవాసా! ౨౧

ముఖ్య"పదార్థాలు": నమించెదను = నమస్కరించెదను;

భావము: ఓ అరుణాచలవాసా! నిత్యము ఆగమ రీతిని అర్చన చేయుచు స్వరయుక్తముగా నమక చమకములు పఠించుచు నీకు నమస్కరించెదను. దయ జూపుమా!



22) కం. అకళంక కీర్తివంతుడ
వు! కామితములను నొసగెదవుతలచినంతన్!
సకలమునకు నీవేయం
డ! కరుణజూడగ వలె! అరుణాచలవాసా! ౨౨

భావము: ఓ అరుణాచలవాసా! సకలమునకు నీవే యండగా తలచినంతనే కోరికలు తీర్చుచు కలంకము లేని కీర్తి కలవాడవు, నన్ను కరుణించుమా!



23) కం. హస్తామలకపు రీతిని
శస్తంబగు జ్ఞానధనమొసగుమా! నాకున్
మస్తిష్కమందు సుగుణము
న్యస్తము జేయగవలె! అరుణాచలవాసా! ౨౩

ముఖ్య"పదార్థాలు": శస్తము = శ్రేష్ఠమైనది; న్యస్తము = ఉంచఁబడినది

భావము: ఓ అరుణాచలవాసా! నా మదిలో సుగుణములుంచుచు శ్రేష్ఠమైన జ్ఞానమును కరతలామలక చందమున నాకివ్వుమా!

24) కం. లయకారునిగా జీవుల
న్యయమును జేయుట, తలుపగ నటరాజుగ నీ
కయినిడి కైవల్యమిదున
నయమనుచు తెలియవలె! అరుణాచలవాసా! ౨౪



ముఖ్య"పదార్థాలు": న్యయము = నాశము; నయము = న్యాయము

భావము: ఓ అరుణాచలవాసా! లయకారునిగ జీవులని నశింప చేయుదువని అనుకొందురు గానీ వారికి కైవల్యమును నిచ్చి భవబంధ విముక్తులను చేయుదువని తెలియనగును.

25) కం. గోపికల కోమల హృదయ
దోఁపరియగు నల్లవానితో చెలిమేమో?
తాపసి! సతిపతివైతివి
నాపై కృపనిడ వలె! అరుణాచలవాసా! ౨౫



భావము: ఓ అరుణాచలవాసా! కృష్ణావతారమున గోపికలందు విరహ తాపము రగిల్చి ప్రణయ కలహములాడిన ఆ శ్రీ హరితో స్నేహము చేసి, తాపసిగావున్న నీవు గూడా సతికి పతివి అయ్యావా!

26) కం. గౌతమ, వశిష్ఠ, ఘట సం
జాత, మరీచాది ముని వ్రజము నిష్ఠితులై
తా తపమొనరించు విధము
నా తరమా తెలియగ! అరుణాచలవాసా! ౨౬



ముఖ్య"పదార్థాలు": ఘట సంజాత = అగస్త్యుడు

భావము: ఓ అరుణాచలవాసా! నిన్ను గూర్చి సప్తర్షులు నిష్ఠతో చేయు తపములు తెలియ నా తరమగునా! నాపై దయ చూపుమా!

27) కం. జలజములు బాల కిరణం
బుల స్పర్శ దొరయ వికసనమొందు విధముగన్
చెలిమిని నా హృత్కమలము
నలరగ జేయు రవివె! అరుణాచలవాసా! ౨౭



ముఖ్య"పదార్థాలు": జలజము = తామర, అలరు = వికసించు

భావము: ఓ అరుణాచలవాసా! ఉదయ భానుడు తన లేత కిరణములచే పద్మములను ఏ విధముగా వికసింపజేస్తాడో, నీవు నా హృదయకమలమును వికసింపజేయుమా!

28) కం. ఆకలిగొన భిక్షనిడిన
జేకొను క్షుద్బాధలు సమసినటులముక్తి
న్నాకలికి జ్ఞాన భిక్షము
నాకొసగుచు కావవె! అరుణాచలవాసా! ౨౮



భావము: ఓ అరుణాచలవాసా! శారిరకమైన ఆకలి అన్నభిక్షతో చల్లారుతుంది. కాని ఆత్మకు మోక్ష సాధనకై కలిగే ఆకలికి జ్ఞాన భిక్ష కావాలి. అటువంటి భిక్ష దయతో నాకు ఇవ్వుమా!

29) కం. యశము నిడు విశేషక షో
డశ కళల నిధివగు శంభుడవు, నా మదిలో
న శమదమమాది గుణకము
న శరణ్యమునొందితి! అరుణాచలవాసా! ౨౯



భావము: ఓ అరుణాచలవాసా! కీర్తినిచ్చే షోడశ కళలకు నీవు దేవుడవు. నా మనసులోని శాంతి భవనమున నిన్ను శరణు గోరి వచ్చాను.

30) కం. వలువలు మార్చు విధంబున
పలుమరు తనువులు విడచుచు పాట్లను పడితిన్
కలలైన జన్మములతో
నలసితి! ముక్తినిడుమ! అరుణాచలవాసా! ౩౦



ముఖ్య"పదార్థాలు": వలువలు = వస్త్రములు

భావము: ఓ అరుణాచలవాసా! ఆత్మగా నేను జీర్ణమైన వస్త్రాన్ని విసర్జించి కొత్త వస్త్రము ధరించు విధమున ఒక శరీరాన్ని విడచి వెరొక శరీరము(జన్మ) తీసుకుంటూ అలసి నీ చెంతకు చేరాను. రక్షించుమా!

31) కం. హీనం బగు మాటలనుచు
న్యూనతను బడయుటకంటెను సమరసతయున్
మౌనమును మాన్యమగునే!
నానోట శుచి నిడవె! అరుణాచలవాసా! ౩౧



ముఖ్య"పదార్థాలు": న్యూనత = కొరత, సమరసము = సమానరాగము, మాన్యమగు = మన్నింపఁదగినది

భావము: ఓ అరుణాచలవాసా! హీనమైన మాటలు మాట్లాడి నలుగురితో నిందలు పడటము కంటే, మౌనముగా వుండుట మేలు గదా! అందుచే నాతో మంచిని మాత్రమే మాట్లాడు విధముగ చూడుమా!

32) కం. "నాకాది లోకవాసము,
నాకేలను?" ఆత్మ చేతనకు కారణమౌ
నీ కంటిచూపు చాలును
నాకదె మోక్షంబగు! అరుణాచలవాసా! ౩౨



ముఖ్య"పదార్థాలు": నాకము = స్వర్గము

భావము: ఓ అరుణాచలవాసా! ఆత్మకు చేతన కారకమైన నీ కంటి చూపు నా పై పడిన అది నాకు మోక్షమవును, ఇంక వేరే స్వర్గ లోకము నాకెందులకు?

33) కం. మాయాపూరితజగమిది
క్షాయకమైన తనువే నిజంబనుకొనుచున్
మాయల చరించు నాకున్
నాయన మమత నిడవె! అరుణాచలవాసా! ౩౩



ముఖ్య"పదార్థాలు": క్షాయకము = నశించునది

భావము: ఓ అరుణాచలవాసా! జగమంతా మాయ అని గ్రహించక, ఈ శరీరము శాశ్వతము అనే మాయలో పడి తిరుగుతున్న నా పై తండ్రివలె మమతను చూపుమా!

34) కం. త్రికరణ శుద్ధిగ నిన్నే
సకలమనుకొనుచు గడపితి శరణార్థుడనై!
అకమునుబాపుచు శీఘ్రము
న కామితములిడ వలె! అరుణాచలవాసా! ౩౪



ముఖ్య"పదార్థాలు": అకము = దుఃఖము

భావము: ఓ అరుణాచలవాసా! సకలమూ నీవేనని శరణుకోరి వచ్చిన నా దుఃఖములను శీఘ్రముగా తొలగించి కొరికలను తీర్చుమా!

35) కం. ప్రారబ్ధ కర్మ ఫలములు
తీరక కలుగు దురితములు తెరప, పలికెదన్
నోరార నీదు నామము
నైరంతర్యంబుగ! అరుణాచలవాసా! ౩౫



ముఖ్య"పదార్థాలు": తెరప = ఉపశమనము; నైరంతర్య = అవిచ్ఛిన్నంగా జరుగుట

భావము: ఓ అరుణాచలవాసా! ప్రారబ్ద కర్మ ఫలముల వచ్చు పాపముల క్షయమునకై నిరంతరము నీ నామము పలికెదను!

36) కం. సనక సనందాది సకల
ముని గణముకు బోధపరుప మూర్తిత్వము పొం
దిన జ్ఞానపూర్ణ రూపము
న, నాకు గురువవ వలె! అరుణాచలవాసా! ౩౬



భావము: ఓ అరుణాచలవాసా! సనక సనంద సకల ముని గణముకు జ్ఞానమును బోధించిన గురు మూర్తివి, నాకు కూడా గురువవుమా!

37) కం. మాటలకతీతమగు నా
పాటులను యెరిగిన దీన బాంధవ! నాతో
నాటలనాపి సుఖమిడుచు
నాటకమాపర! భవ! అరుణాచలవాసా! ౩౭



భావము: ఓ అరుణాచలవాసా! మాటలకు అతీతమైన నా పాటులను తెలిసి కూడా నాతో ఆటలేల! నీ నాటకమాపి నాకు సుఖమిడుమా!

38) కం. కర్తవు నీవె! సకల సం
హర్తవు నీవే! కుమతుల హారివి, నాదున్
వర్తన సుపథము జేసెడి
నర్తనుడవు నీవెగ! అరుణాచలవాసా! ౩౮



ముఖ్య"పదార్థాలు": కర్త = చేయువాఁడు, సంహర్త = సంహరించువాఁడు, వర్తన = జీవనము, నర్తనుఁడు = నర్తకుఁడు

భావము: ఓ అరుణాచలవాసా! ఈ లోకములో అన్నిటికి కర్తవు నీవే, సంహర్తవు నీవే. కుమతుల హారివైన నీవు నా ప్రవర్తన మంచి దారిలో నుండునట్లు చూసేవాడవు కూడా నీవే కదా!



39) కం. భ్రమరము కుసుమపు మకరం
దము గ్రోలి తనివి దొఱయు విధము గా నేను
న్నమృతమగు నీదు ధ్యానము
న మునగ వరమిడ వలె! అరుణాచలవాసా! ౩౯

ముఖ్య"పదార్థాలు": దొఱయు = కలుగు

భావము: ఓ అరుణాచలవాసా! భ్రమరము కుసుమములో వున్న మకరందమును గ్రోలు విధమున, నేను నీ ధ్యానమనే మకరందాన్నీ నిరంతరము ఆస్వాదించునట్లు వరమిడుమా!



40) కం. పశువుకు గ్రాసమును వెదకె
డి శిక్షణనెవరెచటను నుడివిరో? తలపన్
పశుపతివగుటను నీదై
న శక్తియని తలచితి! అరుణాచలవాసా! ౪౦

భావము: ఓ అరుణాచలవాసా! పశువుకు గ్రాసము కోసం వెదకే శిక్షణ ఎవరు ఎక్కడ ఇస్తారు అని తలచిన, పశుపతివైన నీకు గాక ఆ శక్తి వేరే ఎవరికి కలదు?

41) కం. తాపము భరించ తరమా?
దోఁపరియై నా మనమును దోచుకొనంగన్!
నీ పదములే శరణమను
నా పై దయనిడ వలె! అరుణాచలవాసా! ౪౧



భావము: ఓ అరుణాచలవాసా! భక్తి అనెడి మత్తులో నా మనసు దోచుకున్న దొంగవు. నీ దర్శనము లేకపోతే ఆ తాపము భరించ తరమా! నీ పాదాలను శరణు వేడిన నాపై దయ చూపుమా!

42) కం. సుజ్ఞాన వికాసముచే
నజ్ఞాన నిశి నెడలింపనాదిత్యుడవై
ప్రజ్ఞా పాటవమిచ్చుచు
నా జ్ఞానము బెంచుమ! అరుణాచలవాసా! ౪౨



భావము: ఓ అరుణాచలవాసా! సూర్యుడు ఆకాశములోని చీకటి పారద్రోలినట్లు, ప్రజ్ఞా పాటవములనిచ్చి, నా జ్ఞానము పెంచి అజ్ఞానపు చీకట్లని తొలగించుమా!

43) కం. తత్వజ్ఞత లేకయు, నీ
తత్వము యెరుగక తిరుగుచు, తాపత్రయలో
లత్వమున గల్గు మదిలో
నత్వము దీర్చి నిలుమ! అరుణాచలవాసా! ౪౩



ముఖ్య"పదార్థాలు": నత్వము = అనుమానము

భావము: ఓ అరుణాచలవాసా! తత్వజ్ఞత లేక, నీ తత్వము తెలుసుకొనలేక, తాపత్రయ లోలత్వము వల్ల మనసులో కలుగు అనుమానాలను దీర్చి నీ నిజ తత్వము తెలియపరచుమా!

44) కం. నిను గూర్చి లోకమంతయు
వెనకుతు యలసితిని గాని, వెతుక మరచితిన్
మనమున నదేమి చిత్రమొ!
నను సత్కృపగన వలె! అరుణాచలవాసా! ౪౪



ముఖ్య"పదార్థాలు": వెనకు = వెదకు

భావము: ఓ అరుణాచలవాసా! నాలోనే నీవున్నావని మరచి నీకోసము లోకమంతయూ వెతకుతున్నాను ఇది ఏమి చిత్రమో! నన్ను కృప చూడుమా!

45) కం. కలల అలలకు నిలయమై,
అలమిన భవబంధములకు నాసట పడితి
న్నలసిన నామది నీ పై
న లగ్నమొనరింపవె! అరుణాచలవాసా! ౪౫



భావము: ఓ అరుణాచలవాసా! భవ బంధాలనే సుడులలో చిక్కుకొని, కలల అలలతో కల్లోలమైన హృదయము నీపై ధ్యాస లగ్నము చేయగలదా? నీ దారి వైపు నన్ను నడుపుమా!



46) కం. కారణమెరుగని జన్మము,
దారా సుతుల వలపుల సదనమున విడచెన్
ధారగ అమూల్య సమయము!
నైరాశ్యము నిడువుము! అరుణాచలవాసా! ౪౬

ముఖ్య"పదార్థాలు": నైరాశ్యము = ఆశలేనితనము

భావము: ఓ అరుణాచలవాసా! జన్మకు అసలైన కారణము తెలుసుకోలేక, భార్యా బిడ్డల వలపులో అమూల్యమైన సమయము వృధా చేసితిని. నైరాస్యము (ఆశలేని) స్థితిని నాకు ప్రసాదించుమా!



47) కం. మనమున నిర్మల భావన
ము, నిరతము 'శివ' యను స్మరణమున గడిపెడి స
జ్జనులకు నిడు నీదు ప్రకట
నను నాకు నొసంగవె! అరుణాచలవాసా! ౪౭

భావము: ఓ అరుణాచలవాసా! మనము నిర్మలంగా, నిరంతరము నీ నామ స్మరణలో గడిపె సజ్జనులకు లభించే నీ దర్శనము నాకు కూడా నొసగుమా!



48) కం. ఏషణముల వలలో బడి
శోషించు మనమునకు తగు సుఖము నొసగగన్
దోష పరిహరమగునటుల
నౌషధమిడు వెజ్జువు! అరుణాచలవాసా! ౪౮

ముఖ్య"పదార్థాలు": ఏషణము = కోరిక, వెజ్జువు = వైద్యుడు

భావము: ఓ అరుణాచలవాసా! కొరికల వలలో పడి బాధ పడుతున్న మనసుకు తగు ఔషధమిచ్చి సుఖమునిచ్చు వైద్యుడవు నీవే!

49) కం. వేద పురాణములితిహా
సాదులు శాస్త్రములనభ్యసన జేనైతిన్
సాదరణముగా కాచుచు
నాదు వినతి వినవలె! అరుణాచలవాసా! ౪౯



భావము: ఓ అరుణాచలవాసా! వేద పురాణములు, ఇతిహాస శాస్త్రములేదియు అభ్యాసము చేయలేని నన్ను సైతము ఆదరించి నా వినతి వినవలె!

50) కం. పైకముల మత్తులో బడి
లోక జనకుడవగు నీదు రూపు మరచితిన్!
శోకము దీర్చుచు నాలో
నైకత్వపు తలపిడు! అరుణాచలవాసా! ౫౦



ముఖ్య"పదార్థాలు": పైకము = ధనము, ఏకత్వపు = ఏకమతిత్వము

భావము: ఓ అరుణాచలవాసా! ధనార్జనలో పడి లోకమంతటికి తండ్రివైన నిన్ను మరిచితిని, నా శోకము తీర్చుచు ఐక్యము చేయునట్లు తలపించు!

51) కం. ఆచార్యునిగా తలచితి
నీ చరణాంబుజములందు నిత్యము లగ్నం
బౌ చక్షువునిడి, కృపచే
నా చరితము బ్రోవవె! అరుణాచలవాసా! ౫౧



భావము: ఓ అరుణాచలవాసా! ఆచార్యునిగా తలచి, నీ పాదపద్మాలలో నిత్యం లగ్నమై ఉండే దివ్య చక్షువునిచ్చి నా జీవితాన్ని కాపాడుమా!

52) కం. రూకపులార్జనలోబడి
సాకతశూన్యముగ నిరత శ్రమలకు నోడ్చే
మాకున్నీ దయ నిడుమా
నాకధుని సిగధరుడ! అరుణాచలవాసా! ౫౨



ముఖ్య"పదార్థాలు": సాకతము = ఊఱడింపు, (సాకతశూన్యము = ఊఱడింపు లేని), నాకధుని = గంగానది/ఆకాశగంగ

భావము: ఓ నాగధుని సిగధరుడా! అరుణాచలవాసా! ధన సంపాదనలో చిక్కుకొని, ఫలితం లేని శ్రమలతో అలసిపోయిన మా మీద దయ చూపుమా!

53) కం. అనిశము నిను వెదకుచు నే
గనిపెట్టి, కడకు శరణనగా, స్థాణువువై
కొనకొండుట పాడియగునె?
నను కృపజూడవె!భవ! అరుణాచలవాసా! ॥౩



ముఖ్య"పదార్థాలు": అనిశము = ఎల్లప్పుడును, కొనకొను = యత్నించు

భావము: ఓ భవబంధ విమోచనకరుడా! అరుణాచలవాసా! ప్రతి అణువులో నిన్ను వెతుకుతూ, చివరికి నిన్ను తెలుసుకొని శరణాగతుడనై నీ దరి చేరగా, స్థానువుగా వుండుట నీకు న్యాయమా!

54) కం. రక్షింపమనుచు వేడిన
కాక్షముతో కదిలి వచ్చి కాచెడువాడా!
అక్షయమగు దయ జూపవె!
నృక్షారూఢాంతక! అరుణాచలవాసా! ॥౪



ముఖ్య"పదార్థాలు": కాక్షము = కటాక్షము, అక్షయము = తఱుఁగు లేనిది, (నృక్ష+ఆరూఢ+ అంతక; నృక్షము = దున్నపోతు; ఆరూఢ = ఎక్కినవాడు; నృక్షారూఢా = యముడు; అంతక = వినాశము చేయువాడు; నృక్షారూఢాంతక = యముడిని సంహరించినవాడా!)

భావము: ఓ అరుణాచలవాసా! రక్షింపమని వేడిన చాలు దయతో కదిలి వచ్చి కాపాడు వాడవు నీవు కదా! తెఱిపి లేకుండా దయ చూపవే. ఒకనాడు మార్కండేయుడు నిను ప్రార్థించగా కదిలి వచ్చి యముడిని సైతము సంహరించావే! అటువంటి దయ నా మీద చూపుమా!

55) కం. బంధముల సాగరములో
కంధరలోతు దుడుకడచి కైవల్యముకై
ప్రందులపడెడు నను కృపన్
నందనమొనరించవె! అరుణాచలవాసా! ॥౫



ముఖ్య"పదార్థాలు": కంధర = మెడ, దుడుకడుచు = మునుగు; ప్రందులపడు = దుఃఖించు; నందనము = సంతోషించు

భావము: ఓ అరుణాచలవాసా! బంధముల సాగరములో కంఠము వరకు మునిగి యున్న నన్ను కాపాడి కైవల్యమును దయతో యియ్యవయ్యా.

56) కం. అచ్చిక లుప్తంబై ని
ల్వచ్చర సంపద నొసగుచు, యౌక్తికములనం
దిచ్చి, శుభంబగు ఫలముల
నచ్చెరువుగ నీయవె! అరుణాచలవాసా! ౫౬



ముఖ్య"పదార్థాలు": అచ్చిక = కొఱంత; అచ్చరము = అక్షరం, వర్ణం; యౌక్తికము = యుక్తిసిద్ధమైనది; అచ్చెరువు = వెఱఁగు, ఆశ్చర్యము.

భావము: ఓ అరుణాచలవాసా! కొరతలేని అక్షర సంపదను, తగు యుక్తిని ప్రసాదించుమా!

57) కం. కోరికలు దెచ్చి పెట్టెడు
ఘోరమగు గతులను మాపి గురువై గీరన్
వారడి జేయుచు దయనిడు
నారాయణ చెలిమరి! అరుణాచలవాసా! ౫౭



ముఖ్య"పదార్థాలు": గీర = మొండిలక్షణము, వారడి = లోపము

భావము: ఓ నారాయణునకు చెలికాడైన అరుణాచలవాసా! కోరికలు తెచ్చిపెట్టే ఘోరమైన గతులకు మూల కారణమైన గర్వమును తీసివేయవయ్యా.

58) కం. ధనముండిన దరి వత్తురు
ధనలేమి గలిగిన జూపు తమదగు నైజం
బును, వారి బారిన పడక
నను రక్షింపవె! శివ! అరుణాచలవాసా! ౫౮



భావము: ఓ అరుణాచలవాసా! మన దగ్గర ధనముండిన అందరు మన దగ్గరికి వచ్చెదరు. ధనములేని సమయములో వారి వారి నిజస్వరూపము తెలియబడుతుంది. అలాంటి వారి బారిన పడనీయక నన్ను రక్షించుము.

59) కం. అనయము నిన్నే తలచుచు
నిను గానక తిరుగు నాకు నీ లీలలు జూ
పి నెఱయగు నీ కరుణతో
నను పాలింపవె! భవ! అరుణాచలవాసా! ౫౯



ముఖ్య"పదార్థాలు": అనయము = నిరంతరము

భావము: ఓ అరుణాచలవాసా! ప్రతి అణువులో నీవు వున్నావు. అటువంటి నిన్ను గ్రహించలేక తిరుగు నాకు నీ లీలలు చూపి నన్ను కరుణించుమా.

60) కం. బాళిగొనెద నీదు కరుణ
వాళిగ వచ్చి వరములను ఫలదము గాంచే
చాళి నిను వినా ఎవరిది?
నాళికభవ సేవిత! అరుణాచలవాసా! ౬౦



ముఖ్య"పదార్థాలు": బాళి = కాంక్ష; వాళి = వాడుక; చాళి = విధము; నాళికభవుడు = బ్రహ్మ

భావము: ఓ బ్రహ్మ సేవిత అరుణాచలవాసా! కోరిన తడవుగా వచ్చి వరములను ప్రసాదించు వాడవు నీవుగాక ఇంకెవ్వరు.

61) కం. ఆశాపాశ విమోచన
కాశను రగిలించి నాదు కడు దుర్లభమౌ
రాశియగు దురిత కర్మలు
నాశనమొనరింపవె! అరుణాచలవాసా! ౬౧



ముఖ్య"పదార్థాలు": ఆశాపాశము = ఆస యను త్రాడు/ముడి,

భావము: ఓ అరుణాచలవాసా! కోరికల బంధనాలలో చిక్కుకున్న నాకు విమోచనపు ఆశను రగిలించావు, పేరుకున్న చెడు కర్మను నాశనము చేయవయ్యా!

62) కం. ముదుసలి ప్రాయములో శ
క్తి దూరమై నిను మరచుచు తిరిగి చెడుట కం
టె దయనిడి నీదు ధ్యానము
న దొరల జేయుమిపుడె! అరుణాచలవాసా! ౬౨



ముఖ్య"పదార్థాలు": దొరలు = అనుభవించు;

భావము: ఓ అరుణాచలవాసా! ముదుసలి వయస్సు వచ్చే వరకు నిన్ను మరచి తిరిగి చెడిపోవుట కంటే, ఎల్లప్పుడూ నీ ధ్యానములో వుండునట్లు చూడవయ్యా!

63) కం. బాపని వలె యజ్ఞములను,
తాపసుని వలె తపములను తరమే చేయన్?
పాపడి వలె దరి జేర్చుము
నా పాలిట దైవమ! అరుణాచలవాసా! ౬౩



ముఖ్య"పదార్థాలు": బాపడు = బ్రాహ్మణుఁడు, తాపసుడు = తపస్సు చేయువాఁడు, పాపడు = బాలుఁడు

భావము: ఓ అరుణాచలవాసా! బ్రాహ్మణుల వలే యజ్ఞయాగాదులను, తాపసుల వలె తపస్సు చేయుట నా తరమా? పసివానిలా భావించి నన్ను నీ దగ్గరకు చేర్చుకోవయ్యా!.

64) కం. అవిసెను ప్రాణంబుల్, నీ
దు వీక్షణము నా యడ నిడి దురితము బోవం
గ వరమిడి నాదు హృదయము
నవురుగ మీటవె! హర!అరుణాచలవాసా! ౬౪



ముఖ్య"పదార్థాలు": అవిసిపోవు = నశించు, నవురుగ = మృదువుగ

భావము: ఓ అరుణాచలవాసా! నీ దర్శనము కొరకు అలసి పోయివున్నాను. నన్ను దూరము పెట్టకుండా నా హృదయమున నిలువవయ్యా!

65) కం. మాయ యనెడి విష సర్పము
కాయంబును కాటు వేయక మునుపె నన్నున్
చేయిని విడువక నడుపుట
న్యాయంబౌను గదర! అరుణాచలవాసా! ౬౫



ముఖ్య"పదార్థాలు": కాయంబు = శరీరము

భావము: ఓ అరుణాచలవాసా! మాయ శరీరమును కాటువేయకమునుపు (నన్ను ఆవరించకముందే) నిన్నే నమ్ముకున్న నా చేయి పట్టి నన్ను నడిపించవయ్యా!

66) కం. నీవే దిక్కని నమ్మితి,
నీవే శరణమని వచ్చి నేనుంటిని స్వా
మీ! వేగిరముగ నీ కృప
నా వశమొనరించవె! అరుణాచలవాసా! ౬౬



ముఖ్య"పదార్థాలు": వేగిరము = వేగము;

భావము: ఓ అరుణాచలవాసా! నీవే దిక్కని నమ్మి నీ శరణు కోరి వచ్చి ఉన్నాను. త్వరగా నీ కృప నాపై చూపించవయ్యా!



67) కం. ధన, జన, యౌవ్వన గర్వం
బునెటుల దరి జేరు? హృదయపు ధ్వనివి నీవై,
నను సద్గతిన నడుపుచుం
డ! నమకచమకప్రియ! అరుణాచలవాసా! ౬౭

ముఖ్య"పదార్థాలు": నమకచమకప్రియ = రుద్రదేవతాకములైన వైదిక ప్రార్థనలు ఇష్టపడువాడు (శివుడు)

భావము: ఓ నమకచమక ప్రియుడైన అరుణాచలవాసా! నా హృదయ స్పందన నీవైయుండగ నాకు ధనము, జన బలము, యౌవ్వనము మొదలగు వాటి వల్ల గర్వము ఎలా వస్తుందయ్యా!



68) కం. రాలక తప్పదు జన్మము,
వేలమువెట్టిగ ధనమును పేర్చగ సుఖమా?
చాలునులె నీదు నామము
నాలుక పై మెదలగ! అరుణాచలవాసా! ౬౮

ముఖ్య"పదార్థాలు": వేలమువెట్టిగ = మిక్కిలి ఆసక్తి

భావము: ఓ అరుణాచలవాసా! ఈ జన్మము ఒకనాడు గతిస్తుంది. అలాంటి దాని కోసం వేలంవేట్టిగా ధనము కూడబెట్టుట ఎందులకు? నాలుకపై నీ నామ స్మరణ చాలు గదా!



69) కం. జ్ఞానము నిచ్చెడి వాడవు,
జ్ఞానమున నిజంబగునది కరుణించుచు సు
జ్ఞాన ప్రకాశ విషయ వి
జ్ఞానము నిడి కృపగను! అరుణాచలవాసా! ౬౯

ముఖ్య"పదార్థాలు": జ్ఞానము = మోక్షవిషయమైన బుద్ధి, తెలివి;

భావము: ఓ అరుణాచలవాసా! నీవే జ్ఞానాన్ని ప్రసాదించే దైవము. జ్ఞానము కేవలం మన బుద్ధితో కాదు, నీ కరుణ ద్వారానే నిజంగా వెలుగుతుంది. నీ అనుగ్రహం ద్వారా ఆ జ్ఞాన ప్రకాశాన్ని నాలో నింపుమా.

70) కం. ప్రాపంచికపు విషయముల
యాపనమున నిజమగునదియైన విషయమున్
దాపరముగాక తిరిగెడి
నాపై కృపగన వలె! అరుణాచలవాసా! ౭౦



ముఖ్య"పదార్థాలు": ప్రాపంచిక = ఐహిక, యాపనము = కాలక్షేపము, దాపరము = ప్రాప్తించు

భావము: ఓ అరుణాచలవాసా! ప్రపంచ విషయాల్లో మనసు తిరుగుతున్నా, నిజమైన సత్యం నీవే అని తెలుసుకున్నాను. అయినా ఆ మనస్సును నీవైపు తిప్పడానికి, నీ కృపే అవసరము.

71) కం. పిలచిన తడువుగ పలికెడు,
తలచిన తడువుగ నిలచెడు దైవంబెవ్వం
డు! లయమొనరింపవే నను
నలువుగ నీలోపల! అరుణాచలవాసా! ౭౧



ముఖ్య"పదార్థాలు": నలువుగ = ప్రేమగ

భావము: ఓ అరుణాచలవాసా! పిలచిన వెంటనే పలికి, తలచిన వెంటనే ప్రత్యక్షమయ్యే దేవుడు నీవు కాక ఇంకెవ్వరు? ప్రేమగ నన్ను నీలో ఐక్యం చేసుకో స్వామి.



72) కం. భూతగణ నాయకుడవే
భీతిని మాపుచభయమిడి ప్రీతిగ నను నీ
లో తీసుకొనగ రావే!
నైతలముంబాపగ! అరుణాచలవాసా! ౭౨

ముఖ్య"పదార్థాలు": నైతలము = దుర్గతి

భావము: ఓ భూతగణ నాయకుడవైన అరుణాచలవాసా! నన్ను దుర్గతి పాలు కాకుండ రక్షించి మోక్షము ప్రసాదించుమా.

73) కం. మృదులతకాధారంబై
న దృఢమగు తరువగు మాడ్కి నన్ను నిలుపుచు
న్నది నీవు గాక యెవర
న్న! దయాసింధో! ప్రభు! అరుణాచలవాసా! ౭౩



ముఖ్య"పదార్థాలు": మాడ్కి = విధము

భావము: ఓ దయాసింధు, అరుణాచలవాసా! మృదువైన లతకు ధృడమైన చెట్టు ఆధారముగా నిలచినట్లు, నాకు నీవుగాక ఇంకెవరు ఆధారము?



74) కం. ఆదిగురువు నీవే నీ
బోధలచే జ్ఞానమిడియపూర్వంబేదా
నో దానిని నాకొసగుచు
నాదు గురువువై నిలు! అరుణాచలవాసా! ౭౪

భావము: ఓ అరుణాచలవాసా! ఆదిగురువు నీవే. నీ బోధలచే నా జ్ఞానము అపూర్వముగా వృద్ధి అగునట్లు చూచి, నాకు గురువుగా నిలువుము.



75) కం. మనమును యెరిగిన వాడవు,
మనమున కోరికలకాద్యమగు వానిన్ చం
ద్రుని సిగ ధరియించితివే!
నను మరువకుమా! శివ! అరుణాచలవాసా! ౭౫

భావము: ఓ అరుణాచలవాసా! చంద్రుడు మనఃకారకుడు. మనసులో కోరికలను కలిగించువాడు. అటువంటి వానిని శిరమున దాల్చితివి, నన్ను మరవకుమా!



76) కం. ద్వైతపు భావనను మునిగి
లాతముతో సంచరించి లక్ష్యమెరుంగన్
కైతల నుడివెడు ప్రజ్ఞను
నాతలపులనుంచవె అరుణాచలవాసా! ౭౬

ముఖ్య"పదార్థాలు": ద్వైతము = జీవాత్మ పరమాత్మలకు భేదము చెప్పెడి యొక మతము, లాతము = ఉద్రేకము, కైతలు = కవిత్వము

భావము: ఓ అరుణాచలవాసా! ద్వైతభావంలో మునిగి, ఇంద్రియాల ద్వారా ప్రపంచంలో సంచరిస్తూ, అసలైన లక్ష్యాన్ని మర్చిపోయాను. నా ఈ అజ్ఞానాన్ని తొలగించి, నిజమైన జ్ఞానాన్ని నా హృదయంలో నిలుపుమా!

77) కం. జయమెవరిది యీ జీవన
ప్రయాణమున, భవ! దిశ,దశ ప్రాప్తాప్రాప్తం
బు యెరుకకురాని జీవికి
నయనము తెరిపింపవె! అరుణాచలవాసా! ౭౭



ముఖ్య"పదార్థాలు": ప్రాప్తాప్రాప్తంబు = ప్రాప్త + అప్రాప్తంబు = పొందఁబడినది + పొందఁబడనిది

భావము: ఓ అరుణాచలవాసా! ఈ జీవన ప్రయాణములో జయమెవరిది?. దిశ, దశ, ప్రాప్తము, అప్రాప్తము ఏది తెలియక తిరుగు జీవుడికి కళ్ళు తెరిపించుమా!

78) కం. నేననెడి అహంకారము
మేనంతయు నిండి యుండి మిడిసిపడెడు యే
మానుష్యాఢింభకులకు
నైనను గతి నీవెగ! అరుణాచలవాసా! ౭౮



ముఖ్య"పదార్థాలు": మిడిసిపడు = మిట్టిపడు, మానుష్యాఢింభకులకు = మూర్ఖులైన మనుష్యులకు

భావము: ఓ అరుణాచలవాసా! కొంతమంది మూర్ఖులు అహంకారముతో అంతా తామే అని అనుకుంటూ వుంటారు. అటువంటి వారికి కూడా కడకు నీవే శరణు అవుదువు.

79) కం. నాతికి సమభాగము నిడి
నీతకముల మార్గదర్శి నీవుగదయ్యా!
నాతనము వదిలి బ్రతుకుట
నా తరమా? కృప నిడు! అరుణాచలవాసా! ౭౯



ముఖ్య"పదార్థాలు": నీతకముల = నియమముల, నాతనము = అహంకారము

భావము: ఓ అరుణాచలవాసా! భార్యకు శరీరములో సగ భాగమిచ్చిన సమన్యాయమునకు మార్గదర్శివి నీవు కదా! అహంకారములను వదిలి బ్రతుకుట మాకు సాధ్యమగునా? కృప చూపించుము.

80) కం. నావను సంద్రము మధ్యన
నావికుడు సమర్థతనిడి నడుపు విధమునన్
నీవిక భవాబ్ధిలో నా
నావను నడిపింపవె! అరుణాచలవాసా! ౮౦



ముఖ్య"పదార్థాలు": భవాబ్ధి = సంసార సాగరము

భావము: ఓ అరుణాచలవాసా! నిపుణుడైన నావికుడు సముద్రము మధ్యలో ఎలా చాకచక్యంగా నావను నడుపునో, అదే విధముగా ఈ భవసాగరములో నా నావను నడుపు భారము నీదే.



81) కం. ఒడిలో నల్లరి చేయుచు
నడిచెడు శిశువును సహించునట్టి జననివౌ
చు డొగరు కాచి సుపథమున
నడుపుచు నను బ్రోవవె! అరుణాచలవాసా! ౮౧

ముఖ్య"పదార్థాలు": డొగరు = అపరాధము, సుపథము = మంచిత్రోవ

భావము: ఓ అరుణాచలవాసా! తన వడిలో శిశువు చేయు అల్లరికి ఆ తల్లికి కోపము రాదు. ప్రేమతో తన బిడ్డను లాలిస్తుంది. అటువంటి మాతృ ప్రేమ నాపై చూపుచు సుపథమున నను నడిపించుమా!



82) కం. మనమనెడి కమలమును నీ
కు నమ్రతన ధ్యానదీక్షకు సమర్పణ చే
సి నిలిచెదను! నా హృదయము
న నిలచి నను దయగను! అరుణాచలవాసా! ౮౨

భావము: ఓ అరుణాచలవాసా! నీ ధ్యాన దీక్షకు నా మనమనెడి కమలమును సమర్పించెదను. నా హృదయమున నిలిచి నన్ను దయచూడుము.



83) కం. నీకున్నీయుటకేదియు
లేకున్నా, భక్తితోడ లెస్సగు హృదయం
బే కానుకగా జేగొని
నైకట్యమున నిలుపు! అరుణాచలవాసా! ౮౩

ముఖ్య"పదార్థాలు": నైకట్యమున = సమీపమున

భావము: ఓ అరుణాచలవాసా! నీకు ఇవ్వటానికి నా దగ్గర యేదియూ లేదు. భక్తితో నిండిన నా హృదయమును స్వీకరించి నీ సమీపమున నను నిలుపవయ్యా!

84) కం. తామిస్ర పూరితమగుచు

కామితముల బంధియైన కరకు మనంబున్

సోముడవై వెలుగు నిడుచు,

నా మదిలో నిలువుము! అరుణాచలవాసా! ౮౪



ముఖ్య"పదార్థాలు": తామిస్రము = చీఁకటి, కామితము = కోరిక, సోముడు = చంద్రుఁడు

భావము: ఓ అరుణాచలవాసా! కోరికల వలన బంధియై చీకటిలో వున్న నా మనములో చంద్రుడివై నిలచి వెలుగు ప్రసాదించుమా.

85) కం. ఆట స్థలంబీ లోకము

నాటకమేల! జనన మరణంబనె చక్రం

బాటంకహీనత నడిపె

నాటకకర్తవు గదె! అరుణాచలవాసా! ౮౫



భావము: ఓ అరుణాచలవాసా! ఈ లోకమే ఒక ఆట స్థలము. జనన మరణ చక్రము అను నాటకమాడించే నాటక కర్తవు నీవు కదా!

86) కం. స్పష్టత లేని ప్రయాణము

కష్టతరమగు నటుల నిను కనుగొన లేన

స్పష్టాధ్యాత్మిక మార్గము

నష్టములే నిచ్చును! అరుణాచలవాసా! ౮౬



భావము: ఓ అరుణాచలవాసా! నీ స్పష్టమైన దర్శనంలేని జీవనయాత్ర క్లిష్టంగా మారుతుంది. నీ రూపం తెలియని ఈ ప్రయాణంలో, ఆధ్యాత్మిక స్పష్టత లేకపోతే, అది నాశానికే దారి తీస్తుంది. నీ స్పష్టమైన మార్గదర్శనమే నాకు ఆశ్రయం.

87) కం. వదలక ననాదరింపవె

గొదయు, రొదయు జూపకుండ కోరి నిను నమిం

చెదను నిరంతరమచ్చర

నదీప్రియ! దురితహర! అరుణాచలవాసా! ౮౭



ముఖ్య"పదార్థాలు": గొదయు = ఆకలి, రొదయు = కలకలధ్వని, అచ్చరనది = గంగానది

భావము: ఓ దురితాలను నశింపజేసే హరా! గంగాప్రియా! అరుణాచలవాసా! నిరంతరము ఆకలి దప్పికలు మాని నిన్ను కోరి నీ నామము చేయు నన్ను వదలక ఆదరించవయ్యా.



88) కం. అన్నీ నీవగు జగమున
మన్నును మిన్నుయును నీదు మాయయనుచు, నా
కన్నులు తెరిపించి నిలుపు
నన్ను ప్రగతి పథమున! అరుణాచలవాసా! ౮౮

భావము: ఓ అరుణాచలవాసా! ఈ జగత్తులో ఉన్నది అన్నీ నీవే అని తెలుసుకున్నాను. స్థూలమైన భూమి నుంచీ సూక్ష్మమైన ఆలోచనలు వరకూ, అన్నీ నీ మాయ మాత్రమే. ఈ మాయ తత్వాన్ని తొలగించి, నా కన్నులను ఆత్మజ్ఞాన దృష్టికి తెరిపించు. నన్ను ఆధ్యాత్మిక ప్రగతి పథంలో నడిపించు.



89) కం. కాపరివని తలచి తరలి
కాపాడుమని దరి జేరగా, మౌనముగా
కోపము నటించ న్యాయమె?
నా పరిరక్షకుడవె! అరుణాచలవాసా! ౮౯

భావము: ఓ అరుణాచలవాసా! నీవే నా రక్షకుడవని నమ్మి, నీ ఆశ్రయానికి వచ్చాను."కాపాడుము" అని ప్రార్థిస్తూ దగ్గరవుతున్న నాకు నీవు స్పందించకపోవడం, దయకు మారుపేరు అయిన నీవు కోపం చూపడం న్యాయమా? నీవే నా పరిరక్షకుడవు గదా!



90) కం. శ్రుతికిన్ సారము నీవే!
స్మృతి పథమున నిలచి నాదు మృదులమగు మదిన్
ప్రతి కదలిక ధర్మపథము
న తిరుగునట్లు గనవె! అరుణాచలవాసా! ౯౦

ముఖ్య"పదార్థాలు": శ్రుతి = వేదము, స్మృతి = తలంపు, ధర్మపథము = ధర్మశాస్త్రము నిర్దేశించిన మార్గము

భావము: ఓ అరుణాచలవాసా! వేదశాస్త్రాల సారాంశం నీవే,నా మృదులమైన మనస్సులో స్థిరంగా ఉండి, స్మృతి మార్గంలో నడిపించు. నా ప్రతి కదలిక ధర్మ మార్గాన జరిగేలా నీ కృప కలుగజేయుము. నీ వల్లే నా జీవితం ధర్మమయమవుతుంది.

91) కం. సమ్మతమౌ జ్ఞానము నిడి
మమ్ములను ప్రకాశ మార్గమందునబెట్టన్
వమ్మవనీయకుమా! మా
నమ్మకమును నీయడ! అరుణాచలవాసా! ౯౧



భావము: ఓ అరుణాచలవాసా! నిజమైన జ్ఞానాన్ని ప్రసాదించి, మమ్మల్ని ఆత్మజ్ఞానమయమైన ప్రకాశ మార్గంలో నడిపించావు. ఇప్పుడు కూడా నీవే మాకు మార్గదర్శి కావాలి. నీపై మా నమ్మకం శాశ్వతము, నీవే మాకు ఆధారము.

92) కం. జ్యోతియని యేది యనగ
న్ద్యోతకమౌ జ్ఞానమంచు తోచుచునుండన్?
నా తలపున మాయ నెగడ
నా తరమా యెరుగుట! అరుణాచలవాసా! ౯౨



ముఖ్య"పదార్థాలు": ద్యోతకము = ప్రకాశింపఁజేయునది

భావము: ఓ అరుణాచలవాసా! "జ్యోతి" అంటే ఏమిటో అనిపించగా, దాన్ని తెలిపే జ్ఞానమే అది అనిపిస్తోంది. అయితే నా తలపులన్నీ మాయాతత్వంతో కూడినవే. అలాంటి పరమ జ్ఞానాన్ని నిజంగా నేను గ్రహించగలుగుతానా? నీ కృప లేకుండా అది సాధ్యమేనా?

93) కం. నశ్వరమగు దేహములివి,
నశ్వర జీవన పయనమున నిను మరచితిన్
శాశ్వతముగ దోషముల
న్నశ్వరమొనరింపవె! అరుణాచలవాసా! ౯౩



ముఖ్య"పదార్థాలు": నశ్వరము = నశించునది

భావము: ఓ అరుణాచలవాసా! ఈ శరీరాలు, ఈ జీవితం అన్నీ నశ్వరమైనవే. ఆ తాత్కాలిక జీవయాత్రలో నేను నిన్ను మరచిపోయాను. శాశ్వతమైన నిన్ను విడచి, తాత్కాలికమైన లోపాలను శాశ్వతమని భావించాను. ఈ అజ్ఞానాన్ని తొలగించవయ్యా!

94) కం. కరుణను బ్రోవగ రారా
పరమశివ! భవహర! రుద్ర! పార్వతి ప్రియుడా!
నిరతమభిషేచన మొసగ
నరులకు పుణ్యంబిడు! అరుణాచలవాసా! ౯౪



ముఖ్య "పదార్థాలు": అరయఁగ = విచారించు

భావము: ఓ అరుణాచలవాసా! ఓ పరమశివా! భవహరా! రుద్రా! పార్వతీ ప్రియుడా! దయచేసి నీ కరుణతో మమ్మల్ని రక్షించడానికి రా. నీ భక్తిని నిరంతరం మరిచిపోకుండా, నిన్ను భక్తితో పూజిస్తాను. నీ దయాపూరిత దర్శనాన్ని ప్రసాదించుమా!



95) కం. దేహముపై మోహంబును
దైహిక వాసన దునుమగ తా బోధ 'త్వమే
వాహం' బను వేదోక్తిగ
నా హృదయమున నిలువు! అరుణాచలవాసా! ౯౫

ముఖ్య"పదార్థాలు": తునుమాడు = ఖండించు, 'త్వమేవాహం' = నీవే నేను (అన్ని జీవులు, వస్తువులు ఒకే చైతన్యంలో భాగమని, లేదా ఒకే సత్యాన్ని సూచిస్తాయని అర్థము)


భావము: ఓ అరుణాచలవాసా! ఈ దేహముపై మోహము తొలగించుటకు, దేహ సంబంధిత వాసనల్ని దూరం చేయుటకు, "త్వమేవాహం" అనే ఆత్మబోధను నాకు బోధించు. ఆ సత్య జ్ఞానాన్ని నా హృదయంలో స్థిరపరచుమా.



96) కం. వ్యష్టియు సమష్టియున్నగు
సృష్టికి స్రష్టగు నలువకు, శ్రీనాథునకున్
స్పష్టమగు శక్తిని బడసి
నష్టమునాపెదవుగ! అరుణాచలవాసా! ౯౬

ముఖ్య"పదార్థాలు": వ్యష్టియు = ఒంటరితనము, సమష్టియు = మొత్తము, సృష్టి= సృజించుట, స్రష్ట = సృజించువాడు, నలువ = బ్రహ్మ, శ్రీనాథుడు = విష్ణువు

భావము: ఓ అరుణాచలవాసా! వ్యష్టి (వ్యక్తిగతం) మరియు సమష్టి (సార్వత్రికం) అన్నింటినీ సృష్టించే పరమేశ్వరుడవు, నీకు స్పష్టంగా అంకితమయ్యే శక్తిని పొందిన తర్వాత, అందులోనే లీనమై పోవడమే నిజమైన మోక్షం.ఆ శక్తిలో నన్ను లీనమయ్యేలా చేయుమా! ఓ అరుణాచలవాసా!.



97) కం. అచ్చులు హల్లులు సకలము
నచ్చికమగు నీ విశేష నామావళికిన్!
ముచ్చటగ నిను పిలిచెద
న్నచ్చెరువందింపవె! అరుణాచలవాసా! ౯౭

ముఖ్య"పదార్థాలు": నచ్చికము = లోపము,

భావము: ఓ అరుణాచలవాసా! అన్నీ అచ్చులు, హల్లులు, నీ విశేష నామావళిని చెప్పడానికి సరిపోవు. నీ నామ స్మరణలో, నిన్ను ముచ్చటగా పిలిచుకుంటూ ఉంటాను. నీ దర్శనముతో ఆశ్చర్యము కలిగించుమా!



98) కం. జడమై భూతసుషుప్తై
పెడదారిన పయనమొంది పెంపొందెనుగా
కడు వాంఛలు నాకున్, నను
నడిపించు సుపథమున!అరుణాచలవాసా! ౯౮

ముఖ్య"పదార్థాలు": జడము = అచేతనము, సుషుప్తము = బాగా నిద్రపోవుచుండే,

భావము: ఓ అరుణాచలవాసా! జడత్వంలో, ఆధ్యాత్మిక నిద్రలో ఉండి, తప్పు దారిలో పయనిస్తూ, ఇప్పుడు ఎన్నో కోరికల వలయంలో చిక్కుకున్నాను. నన్ను నీ కృపతో మంచి మార్గంలో నడిపించుమా!



99) కం. భేదము గలదే ఆత్మకు
నూ, దాన్యాధారమగుచు నుండునొడలుకున్?
భేదము గలదే మనకున్
నాదియు నీదుయునను? అరుణాచలవాసా! ౯౯

ముఖ్య"పదార్థాలు": ఒడలు = దేహము

భావము: ఓ అరుణాచలవాసా! నీవే ఆత్మకు ఆధారమై ఉన్నవాడివి. అప్పుడు ఆత్మకు నీకు వేరుదనం ఉందా? మన మధ్య "ఇది నాది", "ఇది నీది" అనే భేదం ఎక్కడిది? ఈ భ్రమను తొలగించు, నిజమైన ఏకత్వాన్ని గ్రహింపజేయుమా!



100) కం. నిందించిన స్తుతియగు నీ
కందముగ, యెరుకత లేక కసిరిన నీవున్
తొందర పడక క్షమించుచు
నందనమొనరింపవె! అరుణాచలవాసా! ౧౦౦

భావము: ఓ అరుణాచలవాసా!నిందించినా కూడా అవి అందముగా నీకు స్తుతిగా మారుతాయి.అజ్ఞానముతో నిన్ను తెలియక నిందించినా క్షమించి ఆనందింప చేయుమా!



101) కం. హిమమును జలమును కలిపిన
తమ సహజాకారమున్ వదలి ఐక్యమగున్!
మమునైక్యంబొనరించగ
నమింతును నిరతమును! అరుణాచలవాసా! ౧౦౧

ముఖ్య"పదార్థాలు": హిమము = మంచు, నమింతు = చేమోడ్పు, నమస్కరించు

భావము: ఓ అరుణాచలవాసా! మంచు నీటిలో కలిసిపోయినప్పుడు, దాని స్వరూపాన్ని విడిచిపెట్టి ఒకటైపోతుంది. అలాగే, నన్ను నీతో ఐక్యమయ్యేలా చేయుము. ఈ ఐక్యత కోసం నిరంతరం నీ పాదాలపై నమస్కరిస్తాను.



102) కం. అరుణాచలమని తలచిన
కరుణింతువు గదె! తలచితి గజచర్మధరా!
గురువనుచు, నాకు జ్ఞానము
నరయగ నిడుమా!భవ! అరుణాచలవాసా! ౧౦౨

భావము: ఓ అరుణాచలవాసా! "అరుణాచలము" అని ఒక్కసారి తలచినా, నీవు కరుణ చూపే వాడివి కదా!నిన్ను నా గురువుగా తలచి ప్రార్థిస్తున్నాను. ఇప్పుడు వచ్చి నన్ను జ్ఞాన స్వరూపుడిగా మలచుమా!



103) కం. వేదాంతసారము తనర
గాదా బ్రహ్మంబెవరని గాంచగ నదియున్
నీదు స్వరూపముయగుచు
న్నాదివియన్నిటికిని! అరుణాచలవాసా! ౧౦౩

ముఖ్య"పదార్థాలు": తనర = అతిశయించు

భావము: ఓ అరుణాచలవాసా! వేదాంత సారాన్ని పూర్తిగా గ్రహించినప్పుడు "బ్రహ్మం ఎవరు?" అనే ప్రశ్నకు జవాబు ఒక్కటే. ఏ సమాధానం వచ్చినా చివరికి నీ స్వరూపానికే దారి తీస్తుంది.అన్నింటికి ఆదివి నీవేనయ్యా!



104) కం. పాలను దాగిన వెన్నయు
నోలముగ నెటు విలసిల్లునో, జ్వాలముగా
హేలమొనర్చు హృదయమున
నాలో ప్రాణమగుచు! అరుణాచలవాసా! ౧౦౪

ముఖ్య"పదార్థాలు": ఓలము = చాటు, హేల = లీల

భావము: ఓ అరుణాచలవాసా! పాలలో వెన్న ఎలా దాగి వుంటుందో. నా హృదయములోని జ్వాల లాగ నీ లీల చూపుమా!

105) కం. "సత్యము నద్వైతమ"నుచు
న్నత్యద్భుత పాఠమున్నొనరి యెల్లరుకున్
సత్యపు మార్గము జూపుము
నైత్యికముగ! భవహర! అరుణాచలవాసా! ౧౦౫



ముఖ్య"పదార్థాలు": ఒనరించు = చేయు, నైత్యికము = ప్రతినిత్యము జరుగునది

భావము: ఓ భవబంధాలను తొలగించే భవహరా! అరుణాచలవాసా! "అద్వైతం సత్యం" అని చెప్పే అద్భుతమైన పాఠం నీదే. అది అందరికీ అర్థమయ్యేలా చేయుట నీ నిత్యకృత్యము కదా!

106) కం. ఏదో ప్రేరణ నాకిడి
మైదమునుంచుచు రచింపమని నాచేతన్
ఏదో వ్రాయించితివిగ
నాదు తలంపున నిలు! అరుణాచలవాసా! ౧౦౬



ముఖ్య"పదార్థాలు": మైదము = మైకము

భావము: ఓ అరుణాచలవాసా! ఏదో దివ్యమైన ప్రేరణ నాలో కలిగించి, నిశ్శబ్దంగా నా అంతరంగం నుండి ఈ రచనను నాతో రాయించావు. ఈ రచన నీ చైతన్యంతో నిండినదే. ఇది నీ సంకల్పమే.

107) కం. క్షమగల వాడవు నా పై
మమత నిడుచు యెరుక లేక మాట్లాడిన నా
భ్రమను తొలగించి నిరతము
నమించునటు జూడవె! అరుణాచలవాసా! ౧౦౭



భావము: ఓ అరుణాచలవాసా! నీవు క్షమాశీలుడవు. నాపై ప్రేమ చూపించు. అజ్ఞానంతో మాట్లాడిన నా భ్రమను తొలగించు. నీ కృపతో నేను నిరంతరం నీ పాదాలకే నమస్కరిస్తూ ఉండగలిగే లాగా చూడుము.

108) కం. మంగళము జ్యోతి రూపుడ!
మంగళము పరమశివ! హర! మంగళ ప్రియుడా!
మంగళమని పలుమారుల
నంగ శుభముల నిడవె!అరుణాచలవాసా! ౧౦౮

ముఖ్య"పదార్థాలు": మంగళము = శుభము, క్షేమము; అరుణాచలవాసా= పంచలింగ క్షేత్రములలో ఒక్కటియైన అరుణాచలమునందు అగ్ని లింగముగా ప్రకటనమైన పరమశివుడు!

భావము: ఓ అరుణాచలవాసా! నీవు జ్యోతి స్వరూపుడవు, శాశ్వత మంగళకరుడవు, పరమశివుడవు, హరుడవు, మంగళాన్ని ప్రేమించే వాడవు. "నీకు మంగళం" అని పలుమారు పిలిచే భక్తులపై శుభఫలితాలు ప్రసాదించుమా! నీ ఆశీర్వాదమే సర్వ మంగళానికి మూలం.




మంగళమ్ మహత్



శా. హే చారుస్మిత చంద్రబింబ వదనా! హ్రీంకార మంత్రోజ్వలా!
శ్రీచక్ర స్థిత బిందుమధ్య నిలయా! శ్రీరాజరాజేశ్వరీ!
యా చింతామణి గేహమందలరు నార్యా షోడశీ! శ్రీకలా!
శ్రీ చిచ్ఛక్తి వటంచుఁ గొల్చెద శివశ్రీ! శ్రీకరీ! శాంకరీ!

(సేకరణ: శ్రీ వంగర కాశీ విశ్వేశ్వర వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారి శ్రీ అద్వైత శాంకరీ శతకము నుండి)



తె.గీ. చెంబెడు జలమునిచ్చిన చెంగున వర
ములిడు సాంబశివా! చిత్తమును కదిగెడి
జలము నేదియూ లేదు నీ జపము గాక!
గిరియు నేదియూ లేదు శ్రీ గిరియు గాక !
సరియగు గురువు లేదు నీ సాటి గాక!



అరుణాచలవాసా!

పరమశివుని తేజోరూపమైన అరుణాచలేశ్వరునికి అర్పితమైన శతకము ఈ "అరుణాచలవాసా!". ఇది కేవలం పద్యమాలిక కాదు, అజ్ఞానం నుండి జ్ఞానానికి, అలజడి నుండి మౌనానికి, భక్తి నుండి "త్వమేవాహం" అను స్థితికి పయనమైన జీవుని యాత్ర. అరుణాచలము పంచభూత క్షేత్రములలో అగ్ని తత్త్వానికి ప్రతీక. ఇది తపోభూమి, జ్ఞానభూమి. ఇక్కడ ప్రతి రాయి 'ఓం నమః శివాయ' అని మౌనంగా ధ్యానిస్తుంది, గాలిలోని ప్రతి అణువు శివతత్త్వాన్ని ప్రచారం చేస్తుంది. ఈ మహాపర్వతం మానవుడి అహంకారాన్ని అగ్నిజ్వాలలలో కరిగించి, "నేనే నీవు – నీవే నేను" అనే అద్వైత సత్యాన్ని ప్రతిధ్వనింపజేస్తుంది. సంబంధ నాయనారు, తిరునావుక్కరసర్, మాణిక్యవాచకర్ వంటి భక్త నాయనారులు ఎందరో ఈ భూమిలో తరించారు. శ్రీ రమణ మహర్షి ఈ అరుణాచలమును కేవలము గిరిగా కాకుండా, సాక్షాత్తు ఘనీభవించిన శివ కరుణా రూపముగా భావించి, ఆ అనుభూతిలో "అక్షరమణమాలై"ను కూర్చారు. అదే ఈ శతకానికి ప్రేరణ. కేవలం భౌతికమైన పర్వత సమీపములో నివాసము, గిరి ప్రదక్షిణము మాత్రమే కాకుండా, శివచైతన్యంలో స్థిరమయిన మనస్సు, అచంచలమైన భక్తి, ఆ అనుభూతిలో మౌనంగా నిలిచిన ఆత్మ ఆ అరుణాచలవాసునికి దగ్గర చేస్తుంది. ఇది భౌతిక యాత్ర కాదు, శివ భక్తి అనే జ్యోతిని మన హృదయంలో వెలిగించడమనే అంతరంగ యాత్ర. "అరుణాచలవాసా!"లోని ప్రతి కంద పద్యము భక్తిని కలిగిస్తూ, పాఠకుని అంతరంగంలో అరుణాచలేశ్వరుని కృపతో భక్తుల హృదయంలో జ్వలించే ఆత్మజ్యోతి అవ్వాలని మనసారా ఆకాంక్షిస్తున్నాము.

– శతకకర్త

SARACHCHANDRA WRITINGS

ISBN No. 978-93-344-2429-4

9 789334 424294